RNI Reg-No.APTEL/2005/19204 ESTD : 1996

# నేటి మనదేశం

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 98 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి గురువారం 9-4-2026 పేజీలు :8 వెల: 1-00

https://netimanadesam.com/

అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి నారాయణ సమీక్ష 2లో

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత రుతువు, చైత్ర మాసం, తిథి॥సప్తమి సా॥6.00, మూల ఉ॥6.08, వర్జ్యం శె.ఉ॥ 6.08వరకు, దుర్ముహూర్తం ఉ॥ 10.01-10.50, శుభ సమయం ఉ॥ 9.00-10.30, రాహుకాలం మ॥1.30-3.00, సూర్యోదయం ఉ॥ 5.59, సూర్యాస్తమయం సా॥ 6.08 గం॥



# పటిష్టంగా రహదారుల నిర్మాణం

– అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశం

**అమరావతి, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో ఉన్న 45 వేల కిలోమీటర్ల పైచిలుకు రహదారుల నిర్వహణ పటిష్ఠంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. వివిధ ప్రాంతాల్లో భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేసి దాని ఆధారంగా మిగతా 2లో..

## భవానీపూర్‌లో మమత నామినేషన్

– భారీ ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు... నా జీవితం ఇక్కడే ప్రారంభమైందని వెల్లడి



**కోల్‌కతా, ఏప్రిల్ 8 (ఆర్ఎన్ఎ):** పశ్చిమబెంగాల్ లో అసెంబ్లీ ఎన్నికల హడావుడి నెలకొంది. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన సొంత నియోజకవర్గం భవానీపుర్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. తన జీవితంలో అంతా ఇక్కడినుంచే మొదలైందని ఈ సందర్భంగా ఆమె వ్యాఖ్యానించారు. నామినేషన్ వేయడానికి ముందు ఖాళీఘాట్‌లోని నివాసం నుంచి అలీపుర్ సర్వే భవనం వరకు ఆమె రోడ్‌షో నిర్వహించారు. ఈ క్రమంలో ఆమె మద్దతుదారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం ఆమె ఇక్కడ నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఆ తర్వాత ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 'నేను పుట్టింది, పెరిగింది భవానీపుర్‌లోనే. నా జీవితంలో అంతా ఇక్కడినుంచే మొదలైంది' అని వ్యాఖ్యానించారు. మొత్తం 294 స్థానాల్లోనూ టీఎంసీ అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ఆమె ప్రజలను కోరారు. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లో భాగంగా.. పలువురి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించడంపై మమత ఆందోళన వ్యక్తంచేశారు. 'ఓటర్ల జాబితా నుంచి అనేకమంది పేర్లను తొలగించడం నాకు చాలా బాధ కలిగిస్తోంది. ఓటరు తుది జాబితా ఇంకా ఎందుకు విడుదల చేయలేదో నాకు అర్థంకావడం లేదు. దీనికి వ్యతిరేకంగా మేం మళ్లీ కోర్టును ఆశ్రయిస్తాం' అని అన్నారు. భవానీపుర్ నుంచి మమత మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. దీదీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గం నుంచి భాజపా తన అభ్యర్థిగా సువేందు అధికారిని బరిలోకి దింపింది. ఇక, బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23, 29న రెండు విడతలుగా జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉండనుంది.

## నౌకలు హర్మూజ్ దాటడానికి ఎలాంటి టోల్ ఫీజ్ వద్దు: ఒమన్




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (ఆర్ఎన్ఎ):** నౌకలు హర్మూజ్ జలసంధిని దాటడానికి ఎలాంటి టోల్ ఫీజ్ వద్దని ఒమన్ తేల్చిచెప్పింది. ఇరాన్ చేసిన ప్రతిపాదనను ఆ దేశం వ్యతిరేకించింది. హర్మూజ్ కు ఇరువైపులా ఉన్న ఈ రెండు దేశాలు.. టోల్ విధించే విషయంపై చర్చించాయి. అనంతరం జలసంధిని దాటే నౌకలపై ఎలాంటి రుసుము విధించబోమని హామీ ఇచ్చే ఒప్పందాలపై ఒమన్ ప్రభుత్వం సంతకాలు చేసినట్లు ఆ దేశ రవాణా శాఖ మంత్రి వెల్లడించారు. ఈ వ్యూహాత్మక కీలక ప్రదేశంలో స్వేచ్ఛాయుత, సురక్షితమైన నౌకాయానాన్ని కొనసాగించడానికి తమ దేశం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఉత్తరాన ఇరాన్, దక్షిణాన ఒమన్ వరకు వ్యాపించి ఉన్న కీలక జలసంధే ఈ హర్మూజ్. కేవలం 53 కి.మీ. విస్తీర్ణం కలిగిఉంది. ఇన్నాళ్లు ఇది ప్రపంచదేశాలకు ఒక అంతర్జాతీయ జలమార్గంగా ఉంది. దాంతో ఎలాంటి ఫీజులు చెల్లించలేదు. కాగా కాల్పుల విరమణ కోసం ఇరాన్..అమెరికాకు పంపిన 10 డిమాండ్లలో హర్మూజ్ వద్ద టోల్ విధించడం కూడా ఉంది. దీని ద్వారా సమీకరించిన డబ్బును తమ దేశ పునర్నిర్మాణానికి ఉపయోగించాలని ఇరాన్ భావిస్తోంది. అందుకు అమెరికా సైతం అంగీకరించడంతో హర్మూజ్ జలసంధి మీదుగా వెళ్లే నౌకల నుంచి ఫీజు వసూలుచేయడానికి ఇరాన్-ఒమన్‌లకు అవకాశం లభించినట్లైంది. ఈ నేపథ్యంలో ఒమన్ ఈ ప్రకటన చేయడం గమనార్హం.

## టిడిపి సమావేశాల నిర్వహణలో నిర్లక్ష్యం

పార్టీ నేతల తీరుపై లోకేశ్ అసహనం... పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు సన్మానం... మంగళగిరి టిడిపి కార్యాలయంలో లోకేశ్




**అమరావతి, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కొందరు పార్టీ నేతల తీరుపై మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్ర అసమనం వ్యక్తం చేశారు. ఇలా అయితే ఎలా అంటూ ఆగ్రహం కూడా వ్యక్తపరచారు. కేడర్ సమావేశాలు, గ్రీవెన్స్ వరుసగా నాలుగు వారాలు నిర్వహించని పలువురు నాయకులను నారా లోకేశ్ మందలించారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి వరుసగా నాలుగు వారాలు కేడర్ సమావేశాలు, గ్రీవెన్స్ నిర్వహించక పోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాలు నిర్వహించకపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకోవాలని పార్టీ కార్యాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నారా లోకేశ్ బుధవారం టీడీపీ నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆ పార్టీ నేతలపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు వారాల నుంచి కేడర్ సమావేశాలు నిర్వహించని పులివెందుల ఇన్‌చార్జ్ బీటెక్ రవి, కమలాపురం ఎమ్మెల్యే చైతన్య రెడ్డి, నాలుగు వారాల నుంచి గ్రీవెన్స్ నిర్వహించని ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ పట్ల నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు కచ్చితంగా నిర్వహించాలని లోకేశ్ హుకుం జారీ చేశారు. ఇకముందు ఇలానే వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని లోకేశ్ స్పష్టం చేశారు. కష్టపడిన వారిని గుర్తించాలనేది తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. నేతల పనితీరే ఇక్కడి వరకు రావడానికి కారణమని మిగతా 2లో..

## విమర్శలపై స్పందించడంలో ప్రజాస్వామ్య పంథాను అనుసరించాలి

– ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



**అమరావతి, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు ఉంటాయని.. వాటిపై స్పందించడంలో ప్రజాస్వామ్య పంథాను అనుసరించాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. ఓ మీడియా ఛానల్‌పై దాడి ఘటనపై ఆయన స్పందించారు. గతంలో జగన్ సీఎం హోదాలో పాఠశాల విద్యార్థుల సమక్షంలోనే హద్దులు దాటి, దిగజారుడు మాటలు మాట్లాడారని పవన్ గుర్తు చేశారు. భార్యను కారుతో పోల్చి మాట్లాడిన జగన్ తీరును ప్రజలు మర్చిపోలేదని పేర్కొన్నారు. అలాగే అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు సతీమణిపై వైకాపా ఎమ్మెల్యేలు అసభ్యంగా మాట్లాడితే జగన్ నవ్వుతూ ప్రోత్సహించారని గుర్తు చేశారు. అప్పట్లో జగన్ కార్యాలయాలపై, ఆయన సంస్థలపైగానీ జనసేన అభిమానులెవరూ దాడి చేయలేదన్నారు. ఎదుటివారు దిగజారి మాట్లాడినా, మనం వారి స్థాయికి దిగజారవద్దని.. ప్రజాస్వామ్య రీతిలోనే స్పందించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వైకాపా నేతలు ఈ రోజుకీ దిగజారి, అభ్యంతరకర భాషలోనే మాట్లాడుతున్నారని విమర్శించారు.

## క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

– ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం అభివృద్ధి... మూడు దశల్లో 160 కోట్లతో అభివృద్ధి పనులు

– క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**విజయవాడ, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్‌లో క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రవాణా, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. క్రీడల వికాసానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోపాటు యువనేత, మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. లోకేశ్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ క్రీడాంధ్ర ప్రదేశ్ కావడం తథ్యమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియాన్ని వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ స్టేడియం అభివృద్ధి కోసం ఖేలో ఇండియా ద్వారా రూ.20 కోట్లు, శాప్ ద్వారా మరో రూ.20 కోట్లు.. అలాగే మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.160 కోట్లను మూడు దశల్లో ఖర్చు చేయనుందని మంత్రి మండిపల్లి తెలిపారు. విజయవాడకు తలమానికంగా నిలిచిన ఈ స్టేడియం గత ప్రభుత్వ పాలనలో ఐదేళ్లపాటు నిర్లక్ష్యానికి గురైందని మంత్రి మండిపడ్డారు. ప్రస్తుతం ఎంపీ కేశినేని శివనాథ్ నాయకత్వం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, శాప్ సమన్వయంతో దీని అభివృద్ధికి జీవో తీసుకురావడం జరిగిందని చెప్పారు. విజయవాడ స్టేడియం అభివృద్ధితోపాటు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా క్రీడల వికాసానికి ఎంపీ అపూర్వ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధి కోసం మంత్రులు, ఎంపీలు నిరంతరం కేంద్ర మంత్రులను కలిసి ఏపీకి కావాల్సిన నిధులను సాధిస్తున్నారని కొనియాడారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా విజయవాడ ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. రాష్ట్ర రాజధానిగా అమరావతికి శాశ్వత గుర్తింపు రావడంతో విజయవాడకు మహర్దశ పట్టనుందని మిగతా 2లో..

## అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం డీపీఆర్ సిద్ధం



**అమరావతి, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం కీలక ప్రాజెక్టును మంజూరు చేసింది. అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. రూ.2,534 కోట్లతో చేపట్టనున్న నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర కేబినెట్ ఆమోదానికి సీపీడబ్ల్యూడీ పంపింది. కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ మిగతా 2లో..

## అందరి కృషితోనే విద్యుత్ శాఖకు మంచి పేరు

– మంత్రి గొట్టిపాటి రవికుమార్



**విజయవాడ, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రైతులకు ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ఆదేశించారని గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గుణదల మిగతా 2లో..

మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతీ ఆశయాన్ని స్వీకరించండి. బలహీనపరిచే ప్రతీ ఆలోచననూ తిరస్కరించండి. మన చుట్టూ ఉండే విషయాలు ఎన్నటికీ మెరుగు పడవు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# ప్రపంచాన్ని బలి చేసిన ట్రంప్ యుద్ధోన్మాదం !

అమెరికా – ఇజ్రాయిల్ చేసిన యుద్ధంతో సాధించిందేమిటి? ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదేలు చేసిన ఈ ఇరు దేశాల నేతలు ఇప్పుడు చిద్విలాసంగానే ఉన్నారు. ఇరాన్‌ను సర్వనాశనం చేయాలని చూసి చేతులు కాల్చుకున్నారు. కానీ ప్రపంచ దేశాలు ఆయిల్, గ్యాస్ దొరక్క విలవిల్లాడాయి. ధరలు పెరిగాయి, విమానాలు రద్దయ్యాయి. ఎక్కడికి పోవాలన్నా విమాన ధరలు అందనంతగా పెరిగాయి. ఇంత విధ్వంసం చేసిన ట్రంప్ .. ఇప్పుడు తాత్కాలికంగా రెండు వారాలు యుద్ధాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. నిజానికి శాశ్వతంగా యుద్ధాన్ని ఆపేసి, ఇరాన్ సహా నష్టపోయిన దేశాల పునర్నిర్మాణంలో పాల్గొనాలి. ఇరాన్ అధినేత ఖమేనీని అంతమొందించి, ఇరాన్‌పై బాంబు దాడులు చేసి సాధించింది మాత్రం శూన్యం. ఓ రకంగా చెప్పాలంటే ఈ యుద్ధంలో ట్రంప్ ప్రథమ దోషి. తరవాతి స్థానం నెతన్యాహూది. వీరి యుద్ధకాంక్షకు, నిరంకుశ వైఖరికి ప్రపంచ దేశాలు అల్లాడాయి. బాంబు దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేసింది. దీంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమై పోతోంది. చమురు ధరలు పెరిగాయి. చమురు అందకుండా పోయింది. నౌకలు ఎక్కడిక్కడే నిలిచి పోయాయి. డాలర్ల లెక్కలో ముడిచమురు ధరలు పెరిగిపోయాయి. వెనువెంటనే ఇతర దేశాల కరెన్సీల, ముఖ్యంగా ఆసియా దేశాల కరెన్సీల విలువలు పడిపోవడం మొదలైంది. దీని ఫలితంగా సంపన్న పెట్టుబడిదారీ దేశాలలోకన్నా ఎక్కువ మోతాదులో మూడవ ప్రపంచ దేశాలలో ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. ఇలా ద్రవ్యోల్బణం పెరిగిపోవడం వలన ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోతోంది. అందువలన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆర్థికమాంద్య ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. చమురుకు కొరత ఏర్పడినందు వలన ఎరువుల ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో ఆ ఎరువుల కొరత ఏర్పడింది. ఫలితంగా ఆహారధాన్యాల ఉత్పత్తి దెబ్బ తింటోంది. ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలలో దుర్భర పరిస్థితుల మధ్య శ్రామిక ప్రజానీకం చిక్కుకుపోతున్నారు. ఇలా ట్రంప్ సాధించిన ఘనతలకు ఇవన్నీ నిదర్శనాలుగా చెప్పుకోవాలి. ఈ సంక్షోభానికి దారి తీసిన చట్టవిరుద్ధమైన, అనైతికమైన యుద్ధానికి ముగింపు తాత్కాలికం కారాదు. శాశ్వతంగా యుద్ధాన్ని ముగించేందుకు బేషరతుగా ట్రంప్ అడుగులు వేయాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చమురు చాలా చిన్న విషయమే అయినా, చమురు ధరల పెరుగుదల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత స్థాయిలో ప్రభావం చూపడం చూస్తున్నాం. ఎందుకంటే చమురు చుట్టూ అన్నీ పెనవేసుకుని ఉన్నాయి. సామ్రాజ్యవాద విస్తరణ, ఆక్రమణ యత్నాలకు ప్రధాన కారణం ముడిపదార్థాల మీద అదుపు సంపాదిం చడమేనని ఇప్పుడు వేరుగా చెప్పాల్సిన పనిలేదు. వెనెజువెలా తరవాత ఇరాన్‌పై దాడి సులభంగా అవుతుందనుకున్న ట్రంప్‌కు ఇదొక పెద్ద షాక్. ఇకముందు ప్రపంచ దేశాలపై దాడులు చేస్తే ఆయా దేశాలు ఎదురుదాడికి సిద్ధంగా ఉంటాయని ట్రంప్ బుద్ధి తెచ్చుకోవాలి. ప్రస్తుత పరిణామాలు ఈ విషయాన్నే బలపరుస్తున్నాయి. ప్రపంచ చమురు ఉత్పత్తుల్లో- ముడి చమురు మాత్రమే కాక, దాని నుంచి వచ్చే వివిధ ఉత్పత్తులన్నీ కలుపుకుని-20 శాతం మాత్రమే హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణా అవుతుంది. రవాణాకు ఆటంకం ఏర్పడింది. ఇంత చిన్న విషయానికే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత పెద్ద స్థాయిలో సంక్షోభం తలెత్తిందంటే చమురు వంటి ముడిసరుకు ఎటువంటి కీలక పాత్ర పోషిస్తోందో బోధపడుతోంది. అంత కీలకమైన పాత్ర పోషించగలగడానికి కారణం చమురు విశ్వవ్యాప్త వాణిజ్య వస్తువు కావడమే అని గుర్తించాలి. అది ఆర్థిక ఇబ్బందులను సృష్టించగలిగే అవకాశం ఎక్కువగా కలిగి ఉంది. దాని ధర పెరగడం వలన కలిగే ద్రవ్యోల్బణ ప్రభావం అంతే తీవ్రంగా ఉంటుంది. ముడి చమురు ధరలో 10 శాతం పెరుగుదల ఉంటే కలిగే ప్రభావం తక్కువగా ఉంటుంది. ముడిచమురు ధరలో వచ్చే మార్పు ఆర్థిక వ్యవస్థ మీద ఇంతటి తీవ్ర ప్రభావాన్ని కలిగించగలదని ఈ నెల రోజుల్లో మనకు అనుభవంలోకి వచ్చింది. డాలర్ విలువ ముడిచమురు విలువతో ముడిపడిపోయి వుంది. అందుకే డాలర్ ఆధిపత్యం కొనసాగేందుకు అమెరికా డాలర్లను ముద్రించి విడుదల చేస్తోంది. ఆ డాలర్లను స్వీకరించడానికి, వాటి విలువను అంగీకరించడానికి ప్రపంచం కూడా సుముఖంగానే ఉంది. అందుచేత ఇప్పుడు ప్రపంచం అంతా డాలర్లు ఎక్కడబడితే అక్కడ ఉన్నాయి. ఈ పరిస్థితిలో డాలర్ ప్రమాణం ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి దాపురిస్తే మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచ స్థిరత్వమే ప్రమాదంలో పడుతుంది. అందుచేత చమురు- డాలర్ ప్రమాణాన్ని నిలబెట్టుకోవడం మరింత కీలకంగా మారింది. అలా నిలబెట్టుకోడానికే చమురును ఉత్పత్తి చేసే దేశాల మీద రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించడానికి అమెరికా పూనుకుంటోంది. అందుకే దాడులుకు తెగిస్తోంది. ముడి చమురుపై పెత్తనం కోసం చేస్తున్న యుద్ధంగా దీనిని చూడాలి. ఇరాన్‌లో ప్రభుత్వాన్ని గద్దె దించేసి తన తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలనన్న ధీమాతో అమెరికా ఇరాన్ మీద దాడికి దిగింది. అయతుల్లా ఆలీ ఖమేనీతో సహా ఇరాన్ ఉన్నతాధికారులను అంతం చేసి, ఇరాన్‌ను తన చెప్పుచేతల్లోకి తెచ్చుకోవాలని, అందుకు ఇజ్రాయిల్‌ను వాడుకోవాలని అమెరికా చూసింది. తన డాలర్ సర్వాధిపత్యాన్ని మరింత బలపరుచుకోవాలన్న ఉద్దేశంతో అమెరికా చేసిన ఈ ప్రయత్నం బెడిసి కొట్టిందనే చెప్పాలి. అయితే ప్రపంచం మాత్రం మూల్యం చెల్లించుకుంది. ఇప్పటికైనా ట్రంప్ కళ్లు తెరవాలి. యుద్ధోన్మాదం నుంచి బయటపడాలి.

## అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి నారాయణ సమీక్ష



**అమరావతి, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజధాని అమరావతిలో ప్రజాప్రతినిధులు, అఖిల భారత సర్వీసు అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయాల పనుల పురోగతిపై పురపాలక శాఖ మంత్రి నారాయణ సమీక్ష చేపట్టారు. అమరావతి గ్రోత్ ఇన్‌ఫ్రా కార్పోరేషన్ ఎండీ శ్రీనివాస్, సీఆర్డీఏ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఏప్రిల్ నెలాఖరుకు పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ప్రస్తుతం పనుల పురోగతి, పెండింగ్‌లో ఉన్న వాటి గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. వాటిని త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

# హోంగార్డుల సమస్యలు పరిష్కరించండి

### తమిళనాడు జాలర్ల దుందుడుకు చర్యలను ఆపండి... సిఎం చంద్రబాబుకు బిజెపి అధ్యక్షుడు మాధవ్ లేఖ

**అమరావతి, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం హోం గార్డులు.. విధి నిర్వహణలో భాగంగా పోస్టింగ్ కారణంగా తమ సొంత ఊళ్లకు దూరంగా ఉంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో చాలా మంది ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో సేవలందిస్తుండగా.. వారి కుటుంబాలు తెలంగాణలో నివసిస్తున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన సుమారు 200 మంది హోంగార్డులు ప్రస్తుతం ఏపీలో పని చేస్తున్నారని వివరించారు. అందువల్ల వారు తీవ్ర వ్యక్తిగత, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దీనితోపాటు నైతిక స్థైర్యాన్ని సైతం వారు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారికి న్యాయం చేయాలని సిఎంను కోరారు. ఆంధ్రప్రదేశ్ సముద్ర తీర ప్రాంతంలోకి తమిళనాడుకు చెందిన జాలర్లు బోట్లు ద్వారా చొచ్చుకొచ్చి స్థానికులను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఈ రెండు సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ లేఖ ద్వారా తీసుకెళ్లారు. ఈ లేఖను ఏపీ బీజేపీ చీఫ్ మాధవ్ బుధవారం అమరావతిలో విడుదల చేశారు. పరస్పర ప్రాతిపదికన రాష్ట్రాల మధ్య బదిలీకి వీలు కల్పించడం ద్వారా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న హోం గార్డుల సమస్యలను పరిష్కరించడంలో సహాయపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. దే విధంగా పొరుగున ఉన్న తమిళనాడులోని కడలూరు, కారేకల్‌కు చెందిన జాలర్లు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ఒంగోలు, బాపట్ల ప్రాంతాలకు వచ్చి స్థానిక మత్స్యకారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ లేఖలో సీఎం చంద్రబాబుకు మాధవ్ వివరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ఇప్పటికే పలు సంఘటనలు అక్కడ జరిగాయని తెలిపారు. తమిళనాడుకు చెందిన మత్స్యకారులు స్పీడు బోట్లతో ఆంధ్ర తీర ప్రాంతంలో మత్స్య సంపదను దోచుకుంటున్నారని విమర్శించారు. ఏడాది మార్చిలో నెల్లూరు జిల్లా జువ్వలదిన్నె ప్రాంతంలో అక్రమంగా సంచరిస్తూ దౌర్జన్యానికి పాల్పడుతున్న తమిళనాడు జాలర్ల బోట్లను అక్కడ స్థానికులు నిర్బంధించారని పీవీఎన్ మాధవ్ గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు స్థానిక అధికారుల తోడ్పాటుతో ఆ బోట్లను రాత్రికి రాత్రే విడుదల చేశారని చెప్పారు. తమిళనాడుకు చెందిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. అక్రమంగా ఆంధ్ర తీర ప్రాంతంలో సంచరిస్తూ స్థానికులను భయ భ్రాంతులకు గురి చేస్తున్న తమిళనాడు జాలర్లపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు పీవీఎన్ మాధవ్ లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.

# 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి




### – వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

**ఏలూరు, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని 2027 నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. పెనుమంట్ర మండలం మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థలో నిర్వహించిన 'మారుతున్న వాతావరణ పరిస్థితులు – సుస్థిర వరి వ్యవసాయం' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. గత ఐదేళ్లలో గోదావరి జిల్లాల్లో కాలువలో కనీసం మట్టి తీయలేదని అన్నారు. గత ఐదేళ్లలో చేసిన రూ. 12 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను దాదాపు నెరవేర్చామని, ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, భాజపా రాజ్యసభ ఎంపీ పాకా సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

# పటిష్టంగా రహదారుల నిర్మాణం

రహదారుల నిర్మాణం జరగాలని సూచించారు. రహదారులు, భవనాలు, రవాణాశాఖపై సచివాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులు, అధికారులతో సీఎం చర్చించారు. ప్రధానంగా రాష్ట్రంలో రహదారుల నిర్వహణ, పాత్ హోల్ ఫ్రీ రహదారులు, ఈవీ బస్సుల వినియోగంపై సమీక్షలో చర్చించారు. ఈ సమీక్షకు మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. మెరుగైన రహదారుల ద్వారా ప్రజలకు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావాలని పేర్కొన్నారు. అతి తక్కువ వ్యయానికే ప్రజా రవాణా జరిగేలా ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇదిలావుంటే ఇటీవల తరచూ ప్రమాదాలకు గురవుతూ... ప్రజల ప్రాణాలను బలిగొంటున్న స్లీపర్ బస్సులను అవసరమైతే భవిష్యత్తులో రద్దుచేస్తామని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే దీనిపై కేంద్రాన్ని సంప్రదించామని పేర్కొన్నారు. 'ప్రయాణించే రెండు ప్రాంతాల మధ్య దూరాన్ని లెక్కించి బస్సు గమ్యస్థానం చేరాల్సిన సమయాన్ని నిర్దేశిస్తాం. అంతకంటే ముందే వెళ్తే బస్సును సిటీలోకి అనుమతించబోం. 300 కి.మీ., అంతకంటే ఎక్కువ దూరం ప్రయాణించే ప్రైవేటు బస్సుల్లో ఇద్దరు డ్రైవర్లు ఉండాల్సిందే. రాత్రిపూట డ్రైవర్ నిద్రపోయేందుకు ఒక సీటు కేటాయించాలి. ఈ విషయాలను ప్రైవేటు బస్సు యాజమాన్యాలకు స్పష్టం చేశాం' అని మంత్రి వెల్లడించారు. బస్సు ప్రమాదాల నియంత్రణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం మంగళవారం సచివాలయంలో సమీక్షిం చింది. రహదారుల వెంబడి స్పీడ్ గన్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే రూ.40 కోట్లు మంజూరుచేసింది. డ్రైవర్‌ను, ఎదురుగా వచ్చే వాహన కదలికల్ని అంచనా వేసేలా ప్రతి బస్సులో రెండు కెమెరాలు ఏర్పాటుచేయాలని ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలను ఆదేశించాం' అని వివరించారు. 'కర్నూలు, మారేడుమిల్లి, మార్కాపురం బస్సు ప్రమాదాలకు మానవ తప్పిదమే కారణమని తేలింది.

# టిడిపి సమావేశాల నిర్వహణలో నిర్లక్ష్యం




చెప్పారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే పార్టీ వందేళ్లు ఉంటుందని తెలిపారు. 'మై టీడీపీ యాప్' టాప్ 10 ఫెర్ఫార్మర్స్‌తో మంత్రి లోకేశ్ ఆత్మీయ భేటీ అయ్యారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశర చేశారు. యాప్ సమర్థ వినియోగం పట్ల ఉత్తమ కార్యకర్తలను లోకేశ్ ఘనంగా సత్కరించారు. తెలుగుదేశం పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించడమే తమ సిద్ధాంతమని లోకేశ్ అన్నారు. పార్టీకి అండగా నిలిచిన వారిని ఎప్పటికీ విస్మరించేది లేదన్నారు. 'మై టీడీపీ యాప్' టాప్-10 ఫెర్మార్మర్లతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా 'మై టీడీపీ యాప్' సమర్థ వినియోగం, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడంపై మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. మీ పని తీరే ఇక్కడి వరకు రావడానికి కారణమంటూ కొనియాడారు. ఉత్తమ కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరించి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం మరింతగా కష్టపడాలని, టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి లోకేశ్ భరోసా కల్పించారు.

# అమరావతిలో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం డీపీఆర్ సిద్ధం

కోసం రూ.1,299.08 కోట్లతో ప్రాజెక్టు డీపీఆర్ తయారైంది. కేంద్ర ఉద్యోగుల నివాస సముదాయాలకు రూ. 1,234.91 కోట్లతో ప్రాజెక్టును ప్రభుత్వం రూపకల్పన చేసింది. కామన్ సెంట్రల్ సెక్రటేరియట్‌లో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు కొలువుదీరనున్నాయి. అమరావతి కేంద్రంగా పనిచేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం బహుళ అంతస్తుల భవనాల నిర్మించాలని నిర్ణయించింది. కేంద్ర గృహ నిర్మాణ శాఖ ప్రతిపాదనకు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే ఆమోదం తెలిపారు. సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి సీఆర్‌డీఏ 22.53 ఎకరాలను కేటాయించింది. అందులో 5.53 ఎకరాల్లో సెక్రటేరియట్, 17 ఎకరాల్లో నివాస సముదాయం నిర్మాణం జరగనుంది. ప్రాజెక్టుపై ఎప్పటికప్పుడు అధికారులతో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సంప్రదింపులు చేశారు. మరోవైపు పదెకరాల్లో అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ నిర్మిస్తామని హుడ్‌కో వెల్లడించింది.

# క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అమరావతి ప్రాంతంతో పాటుగా విశాఖ, తిరుపతి, విజయవాడ నగరాల్లో క్రీడా వసతులు మెరుగవుతున్నాయని చెప్పుకొచ్చారు. విజయవాడ ఐజీఎంసీ స్టేడియాన్ని సుమారు రూ.185 కోట్ల వ్యయంతో మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నట్లు ఎంపీ వెల్లడించారు. అమరావతి స్పోర్ట్స్ సిటీ కానుందని, స్పోర్ట్స్ యూనివర్శిటీ కూడా ఏర్పాటు కానుందని ఆయన పేర్కొన్నారు. అమరావతిలో 2,500 ఎకరాల్లో భారీ స్పోర్ట్స్ సిటీని నిర్మించాలని సీఎం చంద్రబాబు కృత నిశ్చయంతో ఉన్నారని శివనాథ్ తెలిపారు. మహిళా క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని చెప్పారు. 2029 నాటికి విజయవాడ, అమరావతిలో నేషనల్ గేమ్స్ నిర్వహించేలా కూటమి సర్కార్ ముందుకు సాగుతోందన్నారు. యువ కెరటాలైన అధికారులు జిల్లా యంత్రాంగంలో ఉండటం ఎన్టీఆర్ జిల్లా అభివృద్ధికి కీలకంగా మారిందని చెప్పుకొచ్చారు. విజయవాడ ఐజీఎంసీ స్టేడియం అభివృద్ధిలో ఎంపీ కేశినేని శివనాథ్ పాత్ర అత్యంత కీలకమని శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు పేర్కొన్నారు. దాని అభివృద్ధి కోసం సుమారు 20 సార్లు స్టేడియానికి వెళ్లి సూచనలు చేసినట్లు ఆయన చెప్పారు. ఎంపీ కేశినేని శివనాథ్ కోరినట్లుగా స్టేడియంలో ఓ బ్లాక్‌కు మహిళా క్రీడాకారిణి పేరు పెడతామని తెలిపారు. వచ్చే ఏడాది నాటికి స్టేడియం రూపు రేఖలు మారిపోనున్నాయని చెప్పుకొచ్చారు శాప్ ఛైర్మన్. వచ్చే సంవత్సరం ఓ అంతర్జాతీయ క్రీడాకారుడిని స్టేడియానికి తీసుకువచ్చి కార్యక్రమం చేపడతామని శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు తెలిపారు.

# అందరి కృషితోనే విద్యుత్ శాఖకు మంచి పేరు

విద్యుత్ సౌధలో ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ నూతన కార్యాలయాన్ని మంత్రి ప్రారంభించారు. "అందరి కృషి కారణంగానే విద్యుత్ శాఖకు మంచి పేరు వచ్చింది. ఛార్జీలు పెంచకూడదు.. సరఫరాలో అంతరాయం ఉండొద్దని సీఎం ఆదేశించారు. చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం. విపత్తుల సమయాల్లో విద్యుత్ శాఖ అధికారుల పని తీరు అభినందనీయం" అని మంత్రి అన్నారు.


**దక్షిణ రైల్వే**

**(ఎలక్ట్రికల్ (జనరల్), నిర్మాణ విభాగం, ఎగ్మోర్, చెన్నై)**

**టెండర్ నోటీస్ నం.: E-HQ-CN-MS-EOT-1-2026-27, తేదీ: 04.04.2026**

భారత రాష్ట్రపతి తరపున, డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ / జనరల్ / నిర్మాణ విభాగం / దక్షిణ రైల్వే / ఎగ్మోర్, చెన్నై - 600 008 వారు క్రింది పనికి ఈ-టెండర్‌ను ఆహ్వానిస్తున్నారు.

పని పేరు:పెరంబూర్ న్యూ రైల్వే హాస్పిటల్ - ఫేజ్-II - న్యూ రైల్వే హాస్పిటల్, పెరంబూర్‌లో C మరియు E బ్లాక్‌లకు ఎలక్ట్రిఫికేషన్ పనులు.

| | టెండర్ నోటీస్ నం. మరియు తేదీ: | E-HQ-CN-MS-EOT-1-2026-27, తేదీ: 04.04.2026 |
|---|---|---|
| 1 | పని పూర్తి చేసే గడువు | 12 నెలలు |
| 2 | అంచనా వ్యయం | రూ. 3,78,54,574.66 |
| 3 | టెండర్ ఫారం ధర | లేదు |
| 4 | ఈఎండీ (EMD) | రూ. 7,57,100/- |
| 5 | టెండర్ ముగింపు తేదీ & సమయం | 29/04/2026 11:00 గంటలకు |
| 6 | టెండర్ ఓపెనింగ్ తేదీ & సమయం | 29/04/2026 11:30 గంటలకు |

పూర్తి వివరాలు www.ireps.gov.in లో చూడవచ్చు

డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, నిర్మాణ విభాగం, చెన్నై, ఎగ్మోర్

(భారత రాష్ట్రపతి తరపున)



**VASTU HOUSING FINANCE**

**వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్**

యూనిట్ నెం. 203 & 204, 2వ అంతస్తు, "A" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబయి – 400015,మహారాష్ట్ర.

సీఐఎన్ నెం.: U65922MH2005PLC272501

**ఆస్తి స్వాధీన నోటీసు**

ఈ క్రింద సంతకం చేసిన నేను వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి గా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 ప్రకారం, అలాగే సెక్షన్ 13(12) తో పాటు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3 క్రింద నాకు కల్పించిన అధికారాలను వినియోగిస్తూ, క్రింద పేర్కొన్న రుణగ్రహీతలకు సంబంధించి, ఆయా నోటీసులలో పేర్కొన్న మొత్తాన్ని, ఆ నోటీసులు అందిన తేదీ నుండి 60 రోజుల్లోపు చెల్లించవలసిందిగా డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.రుణగ్రహీతలు పేర్కొన్న మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనందున, పై చట్టంలోని సెక్షన్ 13(4) మరియు సంబంధిత నియమావళిలోని రూల్ 8 ప్రకారం నాకు కల్పించిన అధికారాలను వినియోగిస్తూ, క్రింద వివరించిన ఆస్తిని, క్రింద పేర్కొన్న తేదీన స్వాధీనం చేసుకోవడమైనది. కావున, ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు హామీదారులు, అలాగే సాధారణ, పజలు ఎవరూ కూడా ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరపరాదని హెచ్చరించబడుచున్నది. ఈ ఆస్తికి సంబంధించిన ఏవైనా లావాదేవీలు,కింద పేర్కొన్న మొత్తం, దానిపై వడ్డీ, ఖర్చులు తదితరాలతో కలిసి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ శాఖకు ఉన్న బాధ్యతకు లోబడి ఉంటాయని తెలియజేయడమైనది.

| క్రమ సంఖ్య | రుణగ్రహీత పేరు, సహ రుణగ్రహీత పేరు రుణ ఖాతా సంఖ్య | డిమాండ్ నోటీసు తేదీ & మొత్తం | ఆస్తి వివరణ | స్వాధీనం తీసుకున్న తేదీ మరియు విధానము |
|---|---|---|---|---|
| 1 | పల్లపు ఆంజనేయులు (ఋణగ్రహీత), పల్లపు ఉమాదేవి (సహ ఋణగ్రహీత) MLP000000230914 | 18/నవంబర్/2025 రూ. 9,34,427/- 17/నవంబర్/2025 నాటికి | అన్నమయ్య జిల్లా, సుండుపల్లె సబ్ డిస్ట్రిక్ట్, రాయచోటి మండలం, పెమ్మడపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని, పెమ్మడపల్లె గ్రామ మజరా, గరుగుపల్లె పొలం, డోర్ నెం. 8/27, సర్వే నెం. 232-1 లేదా 2-83 సెంట్లలోని 97.77 చదరపు గజాలు లేదా 81.7422 చదరపు మీటర్లు గల స్థలం. ఈ ఆస్తి పన్ను పెమ్మడపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి వారు, పి. ఆంజనేయులు పేరుమీద జారీ చేసినది. రశీదు నెం. 4376, అసెస్‌మెంట్ నెం. 361, ఇల్లు నెం. 8/27, తేదీ 02-11-2024. కొలతలు: తూర్పు-పడమర: 22 అడుగులు లేదా 6.7056 మీటర్లు ఉత్తరం-దక్షిణం: 40 అడుగులు లేదా 12.1920 మీటర్లు మొత్తం విస్తీర్ణం: 97.77 చదరపు గజాలు ఆర్‌సీసీ స్లాబ్ నిర్మాణం విస్తీర్ణం: 660 చదరపు అడుగులు హద్దులు: ఉత్తరం – కె. సుధాకర్ వారి ఇల్లు దక్షిణం – రహదారి తూర్పు – పల్లపు రమణ వారి ఇల్లు పడమర – పల్లపు సురేంద్ర వారి ఇల్లు | లాంభన ప్రాయిస్వాధీనం తీసుకున్న తేదీ: 07 / 04 / 2026 |
| 2 | కొటకొండ రామచంద్ర (ఋణగ్రహీత), రామనమ్మ కొటకొండ (సహ ఋణగ్రహీత), కొటకొండ సాయికుమార్ (సహ ఋణగ్రహీత) MLP000000224627 | 18/నవంబర్/2025 రూ. 8,23,608/- 17/నవంబర్/2025 నాటికి | అన్నమయ్య జిల్లా, సుండుపల్లె సబ్ డిస్ట్రిక్ట్, రాయచోటి మండలం, పెమ్మడపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని, పెమ్మడపల్లి గ్రామ మజరా, గరుగుపల్లె పొలం, డోర్ నెం. 7/18, సర్వే నెం. 268-2, 1-72 సెంట్లలోని 0-93 సెంట్లలో భాగంగా 180 చదరపు గజాలు లేదా 150.4800 చదరపు మీటర్ల విస్తీర్ణం గల స్థలం. పిన్ కోడ్: 516269. హద్దులు: ఉత్తరం – పల్లపు రాణి వారి స్థలం , దక్షిణం – కొటకొండ మల్లికార్జున వారి స్థలం , తూర్పు – రహదారి పడమర – కొటకొండ రమణమ్మ వారి స్థలం | లాంభన ప్రాయిస్వాధీనం తీసుకున్న తేదీ: 07 / 04 / 2026 |
| 3 | పి శివ శంకర్ (ఋణగ్రహీత), పుట్ట లక్షుమ్మ (సహ ఋణగ్రహీత) LP0000000106032 LP0000000149049 | 15/డిసెంబర్/2025 రూ. 12,33,140/- & రూ. 10,26,283/- 12/డిసెంబర్/2025 నాటికి | కడప జిల్లా, సిద్దవాతం సబ్ డిస్ట్రిక్ట్, సిద్దవాతం మండలం, ఉప్పరపల్లె గ్రామ పంచాయతీ, శకరాజుపల్లె గ్రామపొలం, శకరాజుపల్లె గ్రామ మజరా, సాయి నగర్, వార్డు నెం. 3, 2వ వీధి, అసెస్‌మెంట్ నెం. 283, సర్వే నెం. 45, డోర్ నెం. 3/60, స్థలం విస్తీర్ణం: 0.05 ఎకరాలు లేదా 0.020 హెక్టర్లు, ఆర్‌సీసీ స్లాబ్ ఇల్లు. కొలతలు: తూర్పు-పడమర: 66 అడుగులు లేదా 20.13 మీటర్లు ఉత్తరం-దక్షిణం: 33 అడుగులు లేదా 10.06 మీటర్లు మొత్తం విస్తీర్ణం: 242 చదరపు గజాలు లేదా 0.05 ఎకరాలు నిర్మాణం విస్తీర్ణం: 2178 చదరపు అడుగుల ఆర్‌సీసీ స్లాబ్ ఇల్లు హద్దులు: ఉత్తరం – మార్ని ల్లాడసిగారి యానాదయ్య వారి ఇల్లు దక్షిణం – డోర్ నెం. 3/63, పుట్ట రామహద్రయ్య వారి ఇల్లు తూర్పు – పంచాయతీ రోడ్ పడమర – మార్నిడి వెంకాసుభ రెడ్డి వారి స్థలం పిన్ కోడ్: 516247, వుంటిమిట్ట, కడప, ఆంధ్రప్రదేశ్ | లాంభన ప్రాయిస్వాధీనం తీసుకున్న తేదీ: 07 / 04 / 2026 |
| 4 | ఎల్లమండ భాస్కర (ఋణగ్రహీత), బండి అనంతేశ్వరి (సహ ఋణగ్రహీత) MLP000000232802 | 16/డిసెంబర్/2025 రూ. 8,94,683/- 16/డిసెంబర్/2025 నాటికి | అన్నమయ్య రిజిస్ట్రేషన్ తేదీ, పిలేరూ సబ్-డిస్ట్రిక్ట్, పిలేరూ మండలం, ముదుపులవేములా గ్రామ పంచాయతీ, ముదుపుల వేములా గ్రామం, మజరా థానవడ్డీపల్లి, సర్వే నెం. 762/5, ప్రభుత్వంలో నమోదు చేసిన ఆర్‌సీసీ ఇల్లు, స్థలం కొలతలు: తూర్పు-పడమర: 63 అడుగులు లేదా 19.215 మీటర్లు ఉత్తరం-దక్షిణం: 16 అడుగులు లేదా 4.880 మీటర్లు మొత్తం విస్తీర్ణం: 112 చదరపు గజాలు లేదా 28 అంకణాలు హద్దులు: ఉత్తరం – 3 అడుగుల రోడ్, వెంకటరమణ వారి ఇల్లు దక్షిణం – ఎ. చంద్రయ్య వారి ఇల్లు , తూర్పు – ఖాళీ స్థలం పడమర – రోడ్ , పిన్ కోడ్: 517214, ఆంధ్రప్రదేశ్ | లాంభన ప్రాయిస్వాధీనం తీసుకున్న తేదీ: 07 / 04 / 2026 |

తేదీ : 09.04.2026
స్థలం : అన్నమయ్య, కడప

అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

# పత్రికా కార్యాలయాలపై దాడులు సరికాదు

**- ఏపీడబ్ల్యూజేఎఫ్ ఖండన - రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు**



**తిరుపతి,ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సమాజంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ నిత్యం సమాజంకోసం పనిచేసే పత్రికలపై దాడులను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తోందని ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఫెడరేషన్ జిల్లా నాయకులతో కలిసి ఆంజనేయులు మాట్లాడారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో పని చేయాల్సిన జర్నలిస్టులు నేడు రాజకీయ పార్టీలు, యాజమాన్యాల మధ్య నలిగిపోతున్నారని, నష్టపోయేది మాత్రం సామాన్య జర్నలిస్టులే అన్నారు. ఇందుకు నిదర్శనం ఆంధ్రజ్యోతి దినపత్రికపై జరిగిన దాడిని ఉదహరించారు. పత్రికలో లేదా, బ్రాడ్ కాస్టింగ్ లో అభ్యంతరకర అంశాలు ప్రసారమైన, ప్రచురితమైన దానిని ఎదుర్కోవడానికి చాలా మార్గాలు ఉన్నాయని, పత్రిక యాజమాన్యం నుండి వివరణ కోరవచ్చని, ఖండన తెలియ చేసుకోవచ్చని, లేదా మరింత తీవ్రంగా ఆ అంశం ఉంటే కోర్టుల ద్వారా కేసు వేసి నష్టపరిహారం కోరవచ్చన్నారు. వీటన్నింటినీ కాకుండా నేరుగా పత్రికల కార్యాలయాలపై దాడులు సమంజసం కాదని చెప్పారు. ముఖ్యంగా ఇటువంటి దాడుల సంఘటనల కారణంగా ఆయా రాజకీయ పార్టీలకు సంబంధించిన క్షేత్రస్థాయి కార్యకర్తలే కేసులలో ఇరుక్కుని బాధింపబడతారన్నారు. విలేకరుల సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు ఆలూరు గిరిధర్, మోహన్ రావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు చెంగల్రాయులు, ప్రధాన కార్యదర్శి వలిగలం గోపి, డిఎంఎసి మెంబర్ మల్లెల వాణి, ఏపీ బ్రాడ్కాస్టింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షులు దాచేపల్లి కిరణ్ పాల్గొన్నారు.

# మానసిక దివ్యాంగురాలి హత్య కేసులో 5 గురికి యావజ్జీవం

**గూడూరు,ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గూడూరు రూరల్ స్టేషన్ పరిధిలోని చవట పాలెంలో జనవరి 2020 సంవత్సరంలో జరిగిన మానసిక దివ్యాంగురాలు షేక్ పర్వీన్‌పై అత్యాచారం చేసి దారుణంగా హత్యకు పాల్పడిన కేసులో నెల్లూరు 8వ అదనపు జిల్లా కోర్టు 5 మందికి యావజ్జీవ కారాగార శిక్ష బుధవారం విధించింది. పోలీస్ కథనం మేరకు జనవరి 2020లో జరిగిన మానసిక వికలాంగు రాలి హత్య కేసులో నేరం రుజువు కావడంతో దుగ్గనబోయిన సాయిశివకుమార్, గోవిందస్వామి వెంకటేష్, శరత్, వినోద్ కుమార్, కృష్ణయ్య అనే నిందితులకు ఒకొక్కరికి జరిమానాతో పాటు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించిందని పోలీసులు తెలిపారు. ఏ2గా వున్న గోవిందస్వామి వెంకటేష్ అనారోగ్యంతో మృతి చెందాడు.

# జనగణన మహా యజ్ఞంలో భాగస్వాములు కావాలి

**అనంతపురం, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కేంద్ర, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా జనగణన తొలి దశ ప్రారంభమైన నేపథ్యంలో, ఈ మహత్తర ప్రక్రియను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా సెన్సెస్ అధికారి ఏ.మాలోల పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లో సెన్సెస్ విభాగం అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో జనగణననిర్వహణపై ముఖ్య సూచనలు చేశారు. అనంతపురం జిల్లాలో 2027 జనగణన తొలి దశలో భాగంగా ఇళ్ల జాబితా , గృహ గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయి ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఏప్రిల్ 9 నుండి 25 వరకు మండల కేంద్రాలలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో నిష్ణాతులైన ట్రైనర్ల ద్వారా ఎంపిక చేసిన అధికారులకు శిక్షణ ఇచ్చినట్లు, ఇక ఫీల్డ్ ట్రైనర్ల ఆధ్వర్యంలో గ్రామ / పట్టణస్థాయిలో ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. దేశ చరిత్రలో 1872లో ప్రారంభమైన జనగణనలో ఇది 16వ జనగణన కాగా, తొలిసారిగా పూర్తిగా డిజిటల్ విధానంలో వివరాల సేకరణ చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత వివరాల గోప్యతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సేకరించిన సమాచారం పూర్తిగా రహస్యంగా ఉంచబడుతుందని స్పష్టం చేశారు. ఈ వివరాలు సమాచార హక్కు చట్టం (ఆర్ టి ఐ) పరిధిలో కూడా ఇవ్వబడవని, న్యాయస్థానాల్లో సాక్ష్యాలుగా ఉపయోగించబడవని తెలిపారు.జన గణన మొదటి దశలో మొత్తం 33 ప్రశ్నల ద్వారా గృహాల స్థితిగతులు, కుటుంబ సభ్యుల వివరాలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు నమోదు చేయబడతాయని చెప్పారు. ఎన్యుమరేటర్లు మీ ఇంటికి వచ్చినప్పుడు వారికి పూర్తి సహకారం అందించాలని ప్రజలను కోరారు. ఏప్రిల్ 16 నుంచి 30 వరకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ అలాగే మే 1 నుంచి 30 వరకు ఎన్యుమరేటర్ ద్వారా గృహ గణనను ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేందుకు వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. తొలి దశలో కుల వివరాలు సేకరించబడవని, రెండో దశలో మాత్రమే జనాభా, కులం, మతం వివరాలు సేకరణ జరుగుతుందని వెల్లడించారు. జనగణన ద్వారా సేకరించే సమాచారం గ్రామ, పట్టణ, రాష్ట్ర , జాతీయ స్థాయిలో అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు, సంక్షేమ పథకాల సరైన అమలుకు ఎంతో కీలకమని తెలిపారు. ఈ నేపథ్యంలో జనగణన ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయడానికి అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కోరారు. కార్యక్రమంలో సెన్సెస్ విభాగం డిప్యూటీ తహసీల్దార్ మధుసూదనరావు, జూనియర్ అసిస్టెంట్ మొహమ్మద్ షఫీ మరియు సెన్సస్ జిల్లా ఇంచార్జ్ సూర్యవర్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీఎస్ఎస్ పనులు 100 శాతం పూర్తి చేయాలి

**- వేసవిలో తాగునీరు, విద్యుత్ సరఫరాలో సమస్యలు రాకూడదు**

**- మంత్రి పయ్యావుల కేశవ్**

**అనంతపురం,ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలో ఆర్డీఎస్ఎస్ పథకం పనులు 100 శాతం పూర్తి చేయాలని ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు , శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం అనంతపురం నగరంలోని ఏపీఎస్పిడిసిఎల్ కార్యాలయంలో విద్యుత్ శాఖలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పథకాల పురోగతి, సానుకూల ప్రజా అవగాహనపై విద్యుత్ శాఖ సమీక్షా సమావేశాన్ని మంత్రివర్యులు నిర్వహించారు. ఆర్డీఎస్ఎస్ పథకం, వేసవిలో విద్యుత్ సరఫరా, కొత్త వ్యవసాయ సర్వీసులు, సమస్యలు, పీఎం సూర్య ఘర్, తదితర అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 11 కెవి ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా త్రీఫేస్ విద్యుత్ సరఫరా కోసం 329 ఫీడర్ల పరిధిలో 746 గ్రామాలను కవర్ చేస్తూ పనులు చేపట్టగా, 110 ఫీడర్ల పరిధిలో పనులు పూర్తి చేయగా, 129 ఫీడర్ల పరిధిలో పనులు మొదలు పెట్టాల్సి ఉండగా, 90 ఫీడర్ల పనులు జరుగుతున్నాయన్నారు. పీఎం సూర్య ఘర్ మీద క్యాంపెయిన్ చేపట్టాలన్నారు. సూర్య ఘర్ కింద మొత్తం 12,268 సర్వీసులు రిజిస్టర్ చేసుకోగా, అందులో 3,064 సింక్రనైజ్డ్ కాగా, 2,721 మందికి సబ్సిడీ అందించడం జరగగా, ఈ కార్యక్రమం కింద ఎప్పటికప్పుడు గట్టిగా మానిటర్ చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, మండల కేంద్రాలల్లో అధికారులు పరిశీలించి అవసరమైన విద్యుత్ నియంత్రికలను ఏర్పాటు చేయాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా విద్యుత్ అంతరాయం లేకుండా క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యుత్ అంతరాయాలను పరిష్కరించాలన్నారు. విద్యుత్ సిబ్బంది కొరతను అవసరమైన చోట వెంటనే భర్తీ చేయాలన్నారు.వేసవిలో తాగునీరు, విద్యుత్ సరఫరాలో సమస్యలు రాకూడదన్నారు. ఎక్కడైనా సమస్యలు వస్తే తక్షణమే పరిష్కరించాలన్నారు. వేసవిలో పెరిగే విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను వెంటనే మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. న్యూ అగ్రికల్చర్ సర్వీసెస్ మంజూరుపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో విద్యుత్ సరఫరాలో మరింత పురోగతి రావాలన్నారు. పాత విద్యుత్ లైన్లను గుర్తించి, వాటిని పూర్తిగా ఆధునీకరించాలని నిర్ణయించామన్నారు. జిల్లావ్యాప్తంగా ఓవర్‌లోడ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు , ఫీడర్లను గుర్తించి, వాటి సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తుంగభద్ర డ్యాం గేట్ కొట్టుకుపోతే పారే నీళ్లలోనే గేట్ పెట్టి, పంటలు కాపాడామన్నారు. జిల్లాలో ప్రజలకు, రైతులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సేవలను అందించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రిశేఖర్, ఈఈలు రమేష్, కళ్యాణ్ చక్రవర్తి, పద్మనాభ పిళ్ళై, శ్రీకాంత్ రెడ్డి, రవిశంకర్, ఏడిలు, జేఈలు, ఏఈలు, షిరిడి సాయి ఎలక్ట్రికల్స్, అదాని పవర్ కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన టిడిపి మండల అధ్యక్షుడికి ఘన సన్మానం



**వరదయ్యపాలెం, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గం, వరదయ్యపాలెం మండలం తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన పీ.యుగంధర్ రెడ్డిని స్థానిక వరదయ్యపాలెం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గతంలో కష్ట సమయంలో పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేసిన యుగంధర్ రెడ్డికి పదవి వల్ల పార్టీలో తెలుగుదేశం కుటుంబ సభ్యులను అండగా వుండి, పార్టీని బలోపేతం చేస్తారని మండల నాయకులు ఆశాభవం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోకేష్ బాబు, శంకర్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారంలో ముందుంటానని హామీ ఇచ్చారు. కార్యకర్తలందరిని కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో నందకిషోర్ రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ పి. నిర్మల్ కుమార్, కె .రమేష్ బాబు, కిన్నెర ఉమా మహేష్, రవి, రాజా తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బొజ్జల బైక్ ర్యాలీ



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కూటమి శ్రేణుల నేతృత్వంలో అమరావతి విజయోత్సవ ర్యాలీ ఘనంగా సాగింది. పట్టణంలోని ఏపీ సీడ్స్ కూడలి నుంచి ప్రారంభమైన ర్యాలీ చతుర్మాడ వీధుల గుండా సాగింది. బైక్ ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరావతి రాజధానిగా చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదం ఆనందకరమన్నారు. జనసేన తరపున ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొట్టేసాయి ప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ



**వరదయ్యపాలెం,ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రత్యేక అధికారిగా ఎంపీడీఓ ఏఓ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు ఆయనకు స్వాగతం పలికి సంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. బాధ్యతలను స్వీకరించిన ఆయనను పలువురు అభినందించారు. అనంతరం ఎంపీడీఓ ఏఓ ప్రసాద్ చిలమత్తూరు పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి, నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులకు సూచించారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఇంతకుముందు ఇంచార్జి ఎంపీడీఓగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉండటంతో ప్రస్తుత బాధ్యతల్లో సమర్థవంతంగా వ్యవహరిస్తారని, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించే దిశగా ఆయన పనిచేస్తారని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ,అభివృద్ధి పనులను వేగవంతం చేయడమే తన లక్ష్యమని ప్రసాద్ తెలిపారు. మండలంలో సమగ్ర అభివృద్ధి సాధనకు అందరి సహకారం అవసరమని ఆయన కోరారు.

# బెట్టింగ్ ఊబిలో పడొద్దు

**- సీఐ ప్రకాష్ కుమార్**



**శ్రీకాళహస్తి , ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఐపీఎల్ సీజన్ తరుణంలో క్రికెట్‌ను కేవలం క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని శ్రీకాళహస్తి పట్టణ సీఐ ప్రకాష్ కుమార్ కోరారు. గతంలో వందలాది యాప్‌లను ప్రభుత్వం నిషేధించిన ప్పటికీ, ఇప్పుడు టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికగా ఈ దందా కొత్త రూపం దాల్చిందన్నారు. డబ్బు కోసం ఇటువంటి ప్రమాదకరమైన యాప్‌లను ప్రమోట్ చేసే సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఫామ్ హౌస్‌లు, రహస్య ప్రాంతాల్లో సాగే ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.బెట్టింగ్ వల్ల అప్పులపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి తెచ్చుకోవద్దని యువత కు తెలియజేశారు. మీ పరిసరాల్లో ఎవరైనా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

# తిరుపతి జిల్లా

# ట్రాఫిక్ తో ఇక్కట్లు

**- క్రమశిక్షణ లేని ఆటో చోదకులు.. పట్టించుకోని పోలీసులు**



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో ట్రాఫిక్‌తో వాహన చోదకులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పెళ్లి మండపం, సినిమా వీధి, నగరి వీధి, భేరి వారి మండపం, బజారు వీధుల్లో నిత్యం ట్రాఫిక్‌తో ప్రజలు, వాహన చోదకులు సతమతమౌతున్నారు. ఈ ప్రాంతాలు ఎప్పుడు జనంతో రద్దీగా ఉండే ప్రాంతాలు కాగా, జయ రామారావు వీధి, సినిమా వీధుల్లో పరిస్థితి ఆగమ్య గోచరంగా వుంది. నాలుగు మాడ వీధుల్లో వన్ వే, వన్ సైడ్ పార్కింగ్ పర్యవేక్షణ మినహా ఇతర అంశాలను పరిగణలోకి తీసుకోవడం లేదు. జయరామరావు వీధిలో పరిస్థితి పరిశీలిస్తే గతంలో ఒక్క ఎల్ఐసి కార్యాలయం వద్ద ఇరుకుతో ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం పార్కింగ్ సదుపాయం కల్పించకుండా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దాని ప్రక్కనే ఆంధ్ర బ్యాంకు ఏర్పాటు చేశారు. దీంతో ఖాతాదారులు రోడ్డుమీద తమ ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీనికి తోడు ఇరుకు వీధుల్లో భేరివారి మండపం నుంచి తూర్పు వైపుకు అడ్డంగా ఆటోలు రావడంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఎదురుగా వచ్చే ఆటోలను పోలీసులు నియంత్రించ గల్గితే ట్రాఫిక్ కు ఇబ్బంది ఉండదు. నగిరి వీధి, నెహ్రూ వీధిలో నిత్యం ప్రజలకు ట్రాఫిక్ సమస్యగా మారింది. ఇక్కడ ఓమాల్ ఏర్పడింది. దానికి పార్కింగ్ లేదు. ఇక బజారు వీధిలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం ప్రక్కనే ఫాస్ట్ ఫుడ్ సెంటర్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. ఈ పాయింట్ల లో నిత్యం పోలీసులు చూస్తూనే ఉంటారు కానీ ఎందుకు స్పందించరో ఆ శివయ్యకే ఎరుక.

# పార్టీలకు అతీతంగా సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**- ఎమ్మెల్యే సునీల్ కుమార్ వెల్లడి**



**గూడూరు , ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కూటమి ప్రభుత్వం గూడూరు నియోజకవర్గంలో పార్టీలకతీతంగా సీఎం సహాయ నిధి నుండి ఆరు కోట్ల రూపాయలు అందించామని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు. సీఎం సహాయనిధి పొందాలంటే పార్టీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు హాజరయ్యారు. ఆయనకు ఎమ్మెల్యే స్వాగతం పలికి, కార్యకర్తలను పరిచయం చేశారు. సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన 19 లక్షల 52 వేల 80 రూపాయల చెక్కులను 42 మంది లబ్ధిదారులకు అందజేశారు. గూడూరు అరుంధతి పాలెం కు చెందిన పేద విద్యార్థి ప్రవీణ్ తేజ కు కంప్యూటర్, చిల్లకూరు మండలం ఎన్ ఆర్ పల్లి కి చెందిన వెంకటసుబ్బయ్యకు వీల్ చైర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీలకతీతంగా సీఎంఆర్ఎఫ్ అందిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే వెంకట రాజు మాట్లాడుతూ.. సునీల్ కుమార్ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారని ఇప్పటివరకు నియోజకవర్గంలో 779 మందికి సీఎం సహాయ నిధి అందించడం అభినందనీయమని అన్నారు. అందరూ కష్టపడి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, రహీం ,శివకుమార్ ,కిషోర్ నాయుడు ,భాస్కర్ రెడ్డి ,శ్రావణి, ప్రమీల , తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నివారణ పై అవగాహన కల్పిస్తూ సైకిల్ యాత్ర



**గూడూరు, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డ్రగ్స్‌కు అలవాటు పడి ఎంతో మంది యువత జీవితం, ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో యువత చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని గూడూరు రూరల్ సీఐ కిషోర్ బాబు కోరారు. డ్రగ్స్ నివారణ పై అవగాహన కల్పిస్తూ వైబ్రంట్స్ ఆఫ్ కలాం సంస్థ తిరుపతి నుండి విశాఖపట్నం వరకు నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర గూడూరు పట్టణ సమీపంలోని ఆదిశంకర డీమ్డ్ టు బి యూనివర్సిటీ కి చేరుకుంది. అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రూరల్ సిఐ మాట్లాడుతూ యువత మత్తుపదార్థాలకు బానిసలై నేరస్తులుగా మారుతున్నారని, డ్రగ్స్ నివారణ పై అవగాహన కల్పిస్తూ కలాం సంస్థ సైకిల్ యాత్ర నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వైబ్రంట్స్ ఆఫ్ కలాం సభ్యులు విజయ కలాం మాట్లాడుతూ దేశానికి వెన్నెముక లాంటి యువతను నాశనం చేసేందుకు అనేక శక్తులు మత్తుపదార్థాలకు యువతను బానిసలు చేస్తున్నారని, మంచి పౌరులుగా యువత దేశానికి సేవలు అందించాలని ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సైకిల్ యాత్ర నెల్లూరు వైపు సాగింది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా. రాజయ్య, డిప్యూటీ రిజిస్ట్రార్ రామయ్య, రూరల్ ఎస్.ఐ. తిరుపతయ్య, చిన్నయ్య , ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రిలో ఘనంగా మదర్ మిల్క్ బ్యాంక్ వార్షికోత్సవం

**- ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా, సీఎస్ఆర్ ఫండ్స్ దాతలు**

**- పాలు దానం చేస్తున్న మాతృమూర్తులకు పాదాభివందనాలు - ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**

**- కోట్లు విలువ చేసే వైద్యం కంటే తల్లిపాలు గొప్ప : ఎంపీ అంబికా**

**అనంతపురం, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎంతో మంది పిల్లల్ని కాపాడుతూ తల్లిపాలు దానం చేస్తున్న ప్రతి మాతృమూర్తికి పాదాభివందనం చేస్తున్నట్లు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో అనంత మదర్ మిల్క్ బ్యాంక్ మొదటి వార్షికోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, సిఎస్ఆర్ ఫండ్స్ దాతలు, సూపరింటెండెంట్ మల్లీశ్వరి, ఆర్ఎంఓ హేమలత, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా మదర్ మిల్క్ బ్యాంకును ఎమ్మెల్యే, ఎంపీ పరిశీలించారు. పాలు దానం చేస్తున్న మహిళలకు చేతులెత్తి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మదర్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు చేసిన ఏడాదిలోనే రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపినందుకు సిబ్బందిని, వైద్యుల్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ ఏడాది క్రితం సిఎస్ఆర్ ఫండ్స్, ఎంపీ ఫండ్స్ తో ఈ మదర్ బ్యాంక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే ఇది మూడవ మదర్ మిల్క్ అని చెప్పారు. ప్రారంభించిన ఏడాదిలోనే రికార్డు స్థాయిలో 480 లీటర్లు సేకరించడం మామూలు విషయం కాదన్నారు. నాలుగు వేల మంది పిల్లలకి అందించారన్నారు. ఎంతో మంది చిన్నారుల ప్రాణాలను కాపాడారన్నారు. దీని వలన పిల్లల మరణాలు కూడా తగ్గినట్లు ఎమ్మెల్యే చెప్పారు. నలుగురికి జన్మనిచ్చిన ఓ మహిళ 5వ కాన్పులో చనిపోయారన్నారు. ఆ బిడ్డ కేవలం 500 గ్రాములు ఉంటే.. ఆ చిన్నారికి ఈ మదర్ మిల్క్ బ్యాంకు ద్వారా పాలు ఇచ్చి కాపాడారన్నారు. ఇతర ప్రైవేట్ ఆస్పత్రులకు ఇక్కడి నుంచి తల్లిపాలు దానం చేస్తున్నట్లు చెప్పారు. తల్లిపాలు దానంచేసే ప్రతి మహిళకు ఏమిచ్చినా.. రుణం తీర్చుకోలేమన్నారు. మదర్ మిల్క్ బ్యాంక్ తరహాలోనే బ్లడ్ బ్యాంక్‌ను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలుపుతామన్నారు. ఇక్కడ కొన్ని ఇబ్బందులు ఉన్నాయని.. వాటిని మంత్రి సత్య కుమార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తల్లిపాల కంటే శ్రేయస్కరం మరొకటి లేదన్నారు. అర్జాస్ పరిశ్రమ వారు 50 లక్షలు, ఇతర సిఎస్ఆర్ ఫండ్స్ తో పాటు తాను కూడా 10 లక్షలు ఇచ్చినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో మూడవ మదర్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటైన ఈ కేంద్రం తొలి ఏడాదిలోనే అగ్రస్థానంలో నిలవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఒక మహిళ 35 లీటర్లు పాలించారంటే ఎంతమందికి ప్రాణం పోశారో ఒకసారి అర్థం చేసుకోవచ్చన్నారు. ఇదే స్ఫూర్తితో మరికొంతమంది మహిళలు పాలు దానం చేసేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కేంద్రం గురించి పెద్ద ఎత్తున ప్రచారం జరగాలని మరికొంత మంది చిన్నారులకు ఈ పాలు అందాలని ఎంపీ ఆకాంక్షించారు.

# 'ప్రజాదర్బార్'లో మంత్రి పయ్యావుల



**ఉరవకొండ,ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉరవకొండలో ఆర్థిక శాఖ మంత్రి క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన "ప్రజాదర్బార్" కార్యక్రమంలో ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు , శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. కార్యక్రమానికి అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, నాయకులు తమ సమస్యలను మంత్రికి తెలపగా, ఆయన స్వయంగా వారి సమస్యలు విని వినతిపత్రాలను స్వీకరించి, ఫోన్ ద్వారా ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తమ ప్రభుత్వానికి అభివృద్ధి , సంక్షేమం ముఖ్యమని, అర్హులైన ప్రతి పేదవారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటూ, రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

# ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో చేరిక



**పలమనేరు, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కృష్ణాపురం గ్రామంలో పలువురు వైకాపా నాయకులు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన ఖాదర్ భాషా, రఫీ, బాబా, షానుల్లా, మాభాష, నవజ్ తదితరులు వైకాపాను వీడి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి సాధరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కరించండి



**రామకుప్పం, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుప్పం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల ఎమ్మార్పీఎస్ నేతలు దళిత సంఘాల వారు రాష్ట్ర ఎస్సీ కమిషనర్ జవహర్ ను కలిసి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు, విచారణలో జరుగుతున్న ఆలస్యం, హాస్టల్స్‌లో శుభ్రత, నిర్వహణ లోపాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖలు మానిటరింగ్ సమావేశాలు సక్రమంగా నిర్వహించకపోవడం వల్ల సమస్యలు మరింత పెరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. రామకుప్పం మండలం బందర్లపల్లి పంచాయతీ గడ్డురు గ్రామానికి సంబంధించిన భూముల సమస్యను బందర్లపల్లి గ్రామస్తులు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి, తమ భూములను కాపాడాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఎస్సీ,ఎస్టీ కేసులను వేగవంతంగా పరిష్కరించడంతో పాటు హాస్టల్స్‌లో శుభ్రత, నిర్వహణపై మానిటరింగ్ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. భూముల సమస్యపై న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. అధికారులు తమ విధుల్లో బాధ్యతతో వ్యవహరించి, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎంఆర్పీఎస్ నాయకులు కోరారు. కుప్పం నియోజకవర్గ కో ఇంచార్జ్ వెంకటేష్ ఎమ్మార్పీఎస్. చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షులు ఎంపీ ప్రకాష్ రామకుప్పం మండల ఇంచార్జ్ గోవిందప్ప ఎం ఎస్ పి రామకుప్పం మండల అధ్యక్షులు జయప్ప మాదిగ సుబ్రహ్మణ్యం, అంజి, కనకమ్మ. సుగుణమ్మ. ఆదెమ్మ. శ్యామలమ్మ. మీనా. మురుగమ్మ. సుజాత. లక్ష్మమ్మ. ధన లక్ష్మమ్మ. మంగమ్మ.కుప్పం నియోజకవర్గ ఎంఆర్పీఎస్ నాయకులు , బందార్లపల్లి పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనవ్యర్థాల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలి



**చిత్తూరు, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పారిశుధ్య కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించే పారిశుధ్య కార్మికులు ఘన వ్యర్థాల నిర్వహణలో అవగాహన పెంచుకోవాలని నగరపాలక ఆరోగ్య అధికారి లోకేష్ చెప్పారు. బుధవారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో నగరపాలక పారిశుధ్య కార్మికులకు ఒకరోజు సామర్థ్య వృద్ధి, నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నాలెడ్జ్ పార్టనర్ అయిన ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ (ఏఐఐఎల్ఎస్జీ ) ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో శానిటరీ కార్మికులకు నగర శుభ్రత, ఘన వ్యర్థాల నిర్వహణ, వ్యర్థాల తడి, పొడిగా వేరు చేయడం, వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగం, ఆరోగ్య, భద్రతా ప్రమాణాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. శానిటేషన్ రంగంలో మెరుగైన సేవలు అందించడానికి అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ లోకనాథం, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

**జైహింద్ పాఠశాలలో....**

స్వచ్ఛ సర్వేక్షన్ 2026 లో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణపై బుధవారం సాయంత్రం నగరంలోని జై హింద్ పాఠశాలలో స్థానిక మహిళలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంహెచ్వో డాక్టర్ లోకేష్ గృహాల్లో ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాలను తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలుగా వేరు చేయడంపై అవగాహన కల్పించారు. ఘన వ్యర్థాలను వేరు చేసి నిర్దేశించిన డబ్బాల్లో వేయాలన్నారు. డస్ట్ బిన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్లు, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**నారాయణవనం,ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలానికి చెందిన ఆర్.ఎస్.కస్తూరి వైద్య ఖర్చులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచింది. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కును నారాయణవనం టిడిపి నాయకులతో కలిసి సత్యవేడు నియోజకవర్గ టిడిపి ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ కురపాటి శంకర్ రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కురపాటి శంకర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, కష్టాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ముఖ్యమంత్రి అందిస్తున్న సాయం బాధిత కుటుంబాలకు కొండంత అండనిస్తుందని పేర్కొన్నారు.

# ఘనంగా అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు

**- కేక్ కట్ చేసి, పేదలకు అన్నదానం చేసిన అభిమానులు**

**- స్వచ్ఛందంగా రక్తాన్ని దానం చేసిన యువత**



**చిత్తూరు, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సినీ నటుడు అల్లు అర్జున్ 44 వ జన్మదిన వేడుకలను చిత్తూరు నగరంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంఎస్ఆర్ సర్కిల్ లో జిల్లా అల్లు అర్జున్ అభిమాన సంఘం అధ్యక్షులు కుట్టీ రాయల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెగాస్టార్ చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మండీ సుధాకర్ రెడ్డి, జిల్లా ప్రతినిధి శ్రీనివాసమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా కుట్టీ రాయల్ మాట్లాడుతూ ... ప్రతి ఏటా తమ అభిమాన నటుడు అల్లు అర్జున్ జన్మదిన వేడుకలను అభిమానుల సమక్షంలో ఘనంగా నిర్వహించు కుంటున్నట్లు పేర్కొన్నారు. తమ అభిమాన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి బన్నీ అభిమానులందరూ రక్తాన్ని దానం చేశారని వెల్లడించారు. ఈ ఏడాది 10 నుంచి 20 సంవత్సరాల లోపు వయసు గల బాలికలకు గర్భాశయ క్యాన్సర్ సోకకుండా ముందస్తుగా వేసే హెచ్పీవీ వ్యాక్సిన్ కు తమ అభిమాన నటుడు అల్లు అర్జున్ బ్రాండ్ అంబాసిడర్ గా ఉండడం గర్వకారణమన్నారు. తాము సైతం అల్లు అర్జున్ బాటలో పయనిస్తూ బాలికల పాఠశాలలు, కళాశాలలు, బాలికల వసతి గృహాల్లోని బాలికలకు హెచ్ పీ వీ వ్యాక్సిన్ పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ అవగాహన కార్యక్రమాలకు బాలికల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. తల్లిదండ్రులు కూడా ముందస్తు జాగ్రత్తగా 10 నుంచి 20 సంవత్సరాల లోపు ఉన్న తమ ఆడ పిల్లలకు హెచ్పీవీ వ్యాక్సిన్ ను వేయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అభిమాన సంఘం నాయకులు అబ్దుల్లా, శివ, ఐకాన్ సురేష్, చంటి సునీల్, లోకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీసీ ధర్మ దీక్షకు మద్దతుగా పుంగనూరులో రిలే నిరాహార దీక్ష



**పుంగనూరు, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బీసీ ధర్మ దీక్షకు మద్దతుగా పుంగనూరులో రిలే నిరాహార దీక్ష బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యం లో నిర్వహించడం జరుగుతుం దన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. బోడె రామచంద్ర యాదవ్ చేపట్టనున్న ఆమరణ నిరాహార దీక్షకు ప్రజల్లో విస్తృత మద్దతు సమీకరించడమే ఈ రిలే నిరాహార దీక్ష ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల నుండి మద్దతును కూడగట్టేందుకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు. బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ఈ నెల 11వ తేదీన చేపట్టనున్న బీసీ ధర్మ దీక్ష ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా పుంగనూరు మూడేప్ప సర్కిల్ లో బిసివై పార్టీ నాయకులు, కార్యకర్తలు రిలే నిరాహార దీక్ష కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ రాష్ట్ర పిఏసి కమిటీ సభ్యులు పాల రమేష్ యాదవ్, పుంగనూరు నియోజకవర్గ కన్వీనర్ హరి బాబు యాదవ్, అన్నమయ్య జిల్లా యూత్ కో-కన్వీనర్ ఉత్తన్న, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ సాంబ మూర్తి తదితరులతో పాటు బీసీపార్టీ సోషల్ మీడియా గిరిబాబు కుమ్మర, వెంకటేష్ యాదవ్, స్వాతి ప్రసాద్, శంకర, గంగరాజు, చలపతి, నాగరాజు, గణేష్, జ్ఞానేంద్ర, గౌడ తదితరులు పాల్గొన్నారు. బీసీల హక్కుల సాధన కోసం జరుగుతున్న ఈ ఉద్యమానికి అందరూ ఐక్యంగా మద్దతు తెలుపుతూ "బీసీ ధర్మ దీక్ష" విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ముడెప్ప సర్కిల్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆర్‌సీవై అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎస్సీ కమిషన్ పనిచేస్తోంది

**- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్**



**చిత్తూరు, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎస్సీ కమిషన్ పనిచేస్తుందని ఎస్సీ కమిషన్ చైర్మన్ కెఎస్ జహార్ పేర్కొన్నారు. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి భవనంలో షెడ్యూల్డ్ కులాల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... చిత్తూరు జిల్లాను ఎస్సీ కమిషన్ ద్వారా సందర్శించే అవకాశం రావడం సంతోషగా ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో విస్తృతంగా పర్యటించి ప్రజలను కలుసుకున్నామని, ముఖ్యంగా భూ సమస్యలు, భూతగాదాలు వంటి అంశాలు వున్నట్లు గుర్తించామని చెప్పారు. సమస్యలన్నింటినీ సమగ్రంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. కాస్ట్ సర్టిఫికెట్ సమస్యల విషయంలో గతంలో "ఆది ఆంధ్ర", "ఆది ఆంధ్ర క్రిస్టియన్" వంటి వర్గీకరణల కారణంగా కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వాటిని కూడా దృష్టిలో పెట్టుకుని పరిష్కార మార్గాలపై సమీక్ష జరుపుతున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని 53 విభాగాలకు సంబంధించిన సంక్షేమ పథకాలు అందరికీ సమానంగా చేరుతున్నాయా లేదా అన్నదానిపై సమీక్ష చేపట్టినట్లు తెలిపారు. తాను కమిషన్ చైర్మన్‌గా 15 శాతం రిజర్వేషన్ పరిధిలో వచ్చే దళితుల సంక్షేమం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన బాధ్యత ఉందన్నారు. చిత్తూరు జిల్లాలో 25 శాతం దళిత జనాభా ఉన్న నేపథ్యంలో వారి సంక్షేమం, అభివృద్ధిలో భాగస్వామ్యం గురించి సమగ్రంగా చర్చించినట్లు చెప్పారు. కలెక్టర్, ఎస్పీతో సమావేశమై తగిన ఆదేశాలు ఇచ్చామని, చిత్తూరు జిల్లాను ఒక మోడల్ జిల్లాగా మార్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. కుల వివక్ష రహిత జిల్లా, అట్రాసిటీ ఫ్రీ జోన్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించారు. సబ్ ప్లాన్ నిధుల వినియోగంపై మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన నిధులు నిర్దిష్ట శాతంలో ఖర్చు చేయకపోతే, సంబంధిత ఆధారాలతో ఫిర్యాదు చేస్తే న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. దళిత క్రైస్తవుల సమస్యలపై మాట్లాడుతూ, 1950 అధ్యక్ష ఉత్తర్వు (ప్రెసిడెంటిల్ ఆర్డర్) ప్రకారం వచ్చిన అంశాలే ప్రస్తుతం మళ్లీ చర్చకు వస్తున్నాయని చెప్పారు. కార్పొరేషన్ లోన్లు లేదా ఇతర ప్రయోజనాలు కులం పేరుతో ఎవరైనా అడ్డుకుంటే వాటిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవస్థలో మార్పులు వచ్చినా, వివక్షకు సంబంధించిన పునాదులు ఇంకా కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కమిషన్ మెంబర్లు , తదితరులు పాల్గొన్నారు.

# హంతకులను శిక్షించాలి



**సత్యవేడు, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా, కేవీ పల్లి మండలం , వడ్డీపల్లి గ్రామస్తుడు అడ్వకేట్ పూజారి ఎల్లయ్యను హత్య చేసిన దుండగులను శిక్షించాలని తిరుపతి జిల్లా సత్యవేడు న్యాయవాదుల బార్ అసోసియేషన్ సెక్రటరీ రాజా కోరారు. న్యాయవాది ఎల్లయ్య ఇంటిపై దాడి చేసి, హత్య చేసిన ఘటనను నిరసిస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో బుధవారం విధులను బహిష్కరించి కోర్టు వెలుపల నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది రాజా మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడులు పెరుగుపోతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. న్యాయవాదులకు రక్షణ కరువయ్యే పరిస్థితి వచ్చిందన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాద వృత్తిలోకి భవిష్యత్తు తరాలు రావాలంటే రక్షణ పరంగా చట్టం అవసరం అన్నారు. హంతకులను గుర్తించి తగిన శిక్ష పడేలా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఎల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు కుబేరన్, వెంకటేశ్వర్లు, లోకేష్, మునిశేఖర్, శివానందం, బాలకృష్ణారెడ్డి , వెంకటేష్, శ్రావణ్, విగ్నేష్, దినకరన్, కిషోర్,అజిత్, అమోస్ పాల్గొన్నారు.

# చిత్తూరు జిల్లా

# బాధ్యతలు స్వీకరించిన బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



**పలమనేరు, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరులో బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం కొలువు తీరింది. బార్ అసోసియేషన్ పాత కార్యవర్గం నూతన కార్యవర్గానికి బుధవారం బాధ్యతలు అప్పగించింది. బుధవారం జరిగిన న్యాయవాదుల సమావేశంలో గత ఏడాది ఎన్నికైన కార్యవర్గం తాము చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ బార్ అసోసియేషన్ కు సంబంధించిన రిజిస్టర్లు అకౌంట్స్ తదితర వివరాలను నూతనంగా ఎన్నికైన కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా పాత కమిటీ సభ్యులకు ఘనంగా వీడ్కోలు పలుకుతూ, నూతన కమిటీకి ఆహ్వానం పలికారు. పాత, నూతన అధ్యక్షులను, ఉపాధ్యక్షులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఎల్. భాస్కర్, నూతన అధ్యక్షుడు ఇర్షద్ అలీ ఖాన్, సీనియర్ న్యాయవాదులు జె. సుబ్రహ్మణ్యం, డి. వి.ప్రకాష్, పి.పరమశివప్ప, కె. లక్ష్మీపతి, బి. రాజారెడ్డి, బి. మోహన్ రెడ్డి, ఎస్. రెడ్డప్ప శెట్టి, సయ్యద్ ఇస్మాయిల్, షేక్ షరీఫ్, లక్ష్మణ్ రెడ్డి, జి.కృష్ణమూర్తి, కె.జగదీష్, పి. ఆర్.లోకేష్, ఫామిద్, మునిరాజులు, ఆరి పుల్లా ఖాన్, మాధవి, ఈ కృష్ణప్ప, సయ్యద్ మోహిద్దిన్, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, ఇబ్రహీం,తదితరులు పాల్గొన్నారు.

# సేవా తత్పరుడు డాక్టర్ మురుగన్



**పలమనేరు , ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గంటాపూర్ కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం కుమారుడు రమేష్ ఇటీవల మృతి చెందాడు. శ్రీ తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్, స్వర్ణ నంది అవార్డు గ్రహీత డాక్టర్ మురుగన్ కు, గంగమ్మ గుడి చైర్మన్ శ్రీధర్‌కు తెలపడంతో బుధవారం దినాలు నిర్వహించుకోవడానికి నిత్యావసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా మృతుని తండ్రి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... తాను అడిగిన తక్షణమే ఆదుకోవడం డాక్టర్ మురుగన్ నైజమన్నారు. ఎవరైనా ఆపదలో ఉంటే నేనున్నానంటూ వారికి సహాయ సహకారాలు అందిస్తారని, ఆయనకు తాను జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు.

# 'స్కిల్ హబ్'లో విద్యార్థులకు ఉచిత శిక్షణ



**పలమనేరు , ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నియోజకవర్గ పరిధిలోని పలమనేరు ఎస్ వి సి ఆర్, డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఏర్పడిన "స్కిల్ హబ్" లో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొంది, ఉత్తీర్ణులైన వారికి బుధవారం కళాశాలలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమం లో కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.... "డోమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ " కోర్సులో 74 మందికి మూడు నెలల శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు ఇచ్చినట్లు చెప్పారు. కోర్సులో నేర్చుకున్న నైపుణ్యంతో ఉపాధి అవకాశాలను పొందవచ్చని, ఈ స్కిల్ హబ్ లో తరచూ కొత్త కోర్సులను ప్రారంభిస్తామని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ అండ్ సోషియల్ మీడియా కోర్సు స్టార్ట్ అవుతుందని, ఆసక్తిగల వారు రిజిస్ట్రేషన్ కొరకు రసూల్ (o91 6300954441) ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.వెంకటేశులు, కాలేజీ స్కిల్ హబ్ ఇంచార్జి కే.సి.హెచ్.వి. సుబ్బయ్య నాయుడు, కళాశాల కోఆర్డినేటర్ వి.సిసింద్రీ, ఎస్.రసూల్, విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన ఎస్.ఐ. బాధ్యతల స్వీకరణ



**రామసముద్రం, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రామసముద్రం మండల పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్.ఐ. హృషీకేశవ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని, చట్టం అమలులో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని తెలిపారు. నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారిస్తూ, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెంచుతామని చెప్పారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తే నేరాలను పూర్తిగా అరికట్టడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పోలీసులు, ప్రజల మధ్య సమన్వయంతో సమాజంలో శాంతి భద్రతలు స్థిరపడతాయని ఆయన అన్నారు.

# వ్యవసాయ విస్తీర్ణం, ఉత్పాదకత పెంచడమే లక్ష్యం

**- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్**

**అనంతపురం, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మినీ కన్ఫారెన్స్ హాలులో ప్రాథమిక రంగం అభివృద్ధిపై వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ శ్యాం ప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ సీజన్ సన్నద్ధతపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. సాగు విస్తీర్ణాన్ని నూరు శాతం అదనంగా పెంచేలా రైతులను సన్నద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వరికి బదులుగా మొక్కజొన్న రాగి ఆరుతడి పంటలను, తక్కువ కాలంలో దిగుబడినిచ్చే కొర్ర, జొన్న, సజ్జ, అపరాల సాగును ప్రోత్సహించాలన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో 100 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం జరిగేలా చూడాలన్నారు. వర్షాధార పంటలకు కీలక సమయంలో నీటి తడులు అందించేందుకు ప్రతి రైతు పొలంలో ఫామ్ పాండ్ (పంట కుంట) ఏర్పాటు చేసుకునేలా చైతన్యం నింపాలన్నారు. వ్యవసాయ అధికారులు వారంలో నాలుగు రోజులు క్షేత్ర పర్యటనలు చేసి రైతులకు సాంకేతిక తోడ్పాటు అందించాలని, సిబ్బందికి ఆధునిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మామిడి, దానిమ్మ, అరటి విస్తీర్ణం పెంచాలని, పట్టు పరిశ్రమలో కొత్త ప్లాంటేషన్ కోసం ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులు, సమాచారం అందించేందుకు త్వరలోనే ప్రత్యేక యూట్యూబ్ ఛానల్ ప్రారంభిస్తామని వెల్లడించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య, ఉద్యాన అధికారి చంద్రశేఖర్, పట్టు పరిశ్రమ అధికారిణి శ్రీమతి శోభారాణి, కో ఆపరేటివ్ అధికారి కృష్ణ నాయక్, సూక్ష్మ నీటిపారుదల అధికారి సుదర్శన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## పదవ తరగతి మూల్యాంకనం పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్ ఆనంద్

**అనంతపురం, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పదవ తరగతి మూల్యాంకనం పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ లోని కేఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి మూల్యాంకనం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూల్యాంకనం ఎలా జరుగుతోంది, ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా, రోజుకు ఎన్ని సబ్జెక్టులు ఇస్తారు, తదితర వివరాలు ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు లేకుండా పదవ తరగతి మూల్యాంకనం సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఈఓ ప్రసాద్ బాబు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓగా డాక్టర్. రాధిక



**మదనపల్లె, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ ఎం ఓగా డాక్టర్ రాధిక గుండాబత్తిని బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బుధవారం ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ , రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాదర్ ఖాన్, రాజంపేట బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల కృష్ణమూర్తి , బిజెపి ప్రధాన కార్యదర్శి యల్లంపల్లి ప్రశాంత్ , మైనారిటీ నాయకులు డాక్టర్. అజ్మతుల్లా ఖాన్, బిజెపి సీనియర్ నాయకులు బర్నేపల్లి రవి కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సమస్యలు, చేపట్టవలసిన చర్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ .. ఆసుపత్రిలో ఈ ఎన్ టి , డెంటల్ విభాగాలు ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందన్నారు. సుఖప్రసవాల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. డయాలసిస్, బెడ్ల సంఖ్యను పెంచడం, అత్యవసర కేసులను వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశామన్నారు. సదరం సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో ఆలస్యం లేకుండా రోగులకు సమయానికి సేవలు అందించాలని కోరమన్నారు. తమ వంతు బాధ్యతగా ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతులు, సిబ్బంది సమస్యలను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

## దళిత క్రైస్తవులుకు ఎస్సీ హోదా కల్పించాలి

**- బిషప్ కౌన్సిల్ కాట్రగడ్డ మార్టిన్**

**కడప, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కడప నగరం రెడీమర్ చర్చి లో నేషనల్ బిషప్ కౌన్సిల్ బిషప్ మల్లెం విజయ భాస్కర్ ఆధ్వర్యంలో రాయలసీమ బిషప్ అండ్ లీడర్స్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ మాజీ ఎం.పి. తులసి రెడ్డి. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు అమీర్ బాబు బండి జకరయ్య, బోనం సైలాసు హాజరయ్యారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి, టిడిపి నేత అమీర్ బాబు, బండి జకరయ్య, బోనం కైలాస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితులకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో 15 మంది బిషప్ లు గా , 9 మంది రెవ రెండ్ లుగా అభిషేకించబడ్డారు. కార్యక్ర మంలో బిషప్ బోనం ప్రభుదాసు. కేసీ డేవిడ్ , మల్లెం విజయ శేఖర్ బిషప్ డేనియల్ కృష్ణ దాసు రెవ మార్కు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధిలో విద్యార్థులు వ్యవస్థాపకులుగా మారాలి

**- సమగ్ర శిక్ష ఏపీసి డాక్టర్. అనురాధ సూచన**

**మదనపల్లె,ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యార్థులు వ్యవస్థాపకులుగా మారితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని సమగ్ర శిక్ష ఏపీసి డాక్టర్ నున్నా అనురాధ పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఎంటర్ప్రెన్యూ రియల్ మైండ్ సెట్ డెవలప్మెంట్ ప్రోగ్రాం జిల్లా స్థాయి ప్రాజెక్ట్ ప్రదర్శన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ , ఉద్యం స్వచంద సంస్థ సంయుక్తంగా అన్నమయ్య జిల్లాలోని పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు వ్యవస్థాపక మనస్తత్వం అభివృద్ధి పరచే కార్యక్రమాన్ని అమలు పరిచామన్నారు. కార్యక్రమం ద్వారా విద్యార్థులలో నైపుణ్యాలు, విమర్శనాత్మక ఆలోచనలు, సృజనాత్మకత వంటి నైపుణ్యాలు పెంపొందించామన్నారు.

# సచివాలయ సిబ్బంది పారదర్శక సేవలందించాలి

**- అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశం**

**- కోటకాడపల్లె సచివాలయం ఆకస్మిక తనిఖీ**



**మదనపల్లె/ తంబళ్లపల్లె ,ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పెద్దమండ్యం మండలం, కోటకాడపల్లె గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ నిశాంత్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు , ప్రజలకు అందుతున్న సేవలు, రికార్డుల నిర్వహణ, వినతులు –ఫిర్యాదుల పరిష్కార విధానాన్ని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రతిరోజూ సమయానికి విధులకు హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న ఫేషియల్ అటెండెన్స్ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ఈ విధానం ఖచ్చితంగా అమలు చేస్తే సేవలలో పారదర్శకత, బాధ్యత మరింత పెరుగుతాయన్నారు. గ్రామస్థుల సమస్యలపై సిబ్బంది బాధ్యతతో స్పందించాలని తెలిపారు. భూ రికార్డులు, ల్యాండ్ రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్, వాటిని సక్రమంగా నవీకరించాలని అధికారులకు సూచించారు. సచివాలయంలోని అన్ని శాఖల వివరాలను డిజిటల్ విధానంలో నవీకరించడంతోపాటు పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. సంక్షేమ పథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన పెంచి అర్హులం దరికీ లబ్ధి చేకూరేలా కృషి చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ తపస్విణి, ఎంపీడీవో శ్రీధర్ రావు, ఎస్.ఐ శ్రావణి రెడ్డి, గ్రామస్తులు సగినాల కేశవ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నేరగాళ్ల గుండెల్లో వణుకు

**- సామాన్యుడికి భరోసా - ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సరికొత్త వ్యూహం**

**- అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పోలీస్ డ్రోన్ నిఘా**



**మదనపల్లె,ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లాలో అసాంఘిక శక్తుల ఆటకట్టించేందుకు పోలీసు యంత్రాంగం సరికొత్త అస్త్రం సంధించింది. నేరగాడు ఏ పొదలో దాగినా, ఏ గల్లీలో నక్కినా కనిపెట్టేలా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాలతో డ్రోన్ ఆపరేషన్ మొదలైంది. ఇకపై నేరం చేసి తప్పించుకోవడం అసాధ్యమన్నట్లుగా, ఆకాశం నుంచి డేగ కన్నుతో జిల్లా పోలీసులు పహారా కాస్తున్నారు. సాధారణంగా రద్దీగా ఉండే జాతరలు, తిరునాళ్లలో దొంగతనాలు, ఆకతాయిల అల్లర్లు ఎక్కువగా జరుగుతుంటాయి. జిల్లాలో జరుగుతున్న ఉత్సవాల్లో జనసమూహాన్ని పర్యవేక్షించేందుకు డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. పాఠశాలల వద్ద విద్యార్థుల భద్రతను పర్యవేక్షించడం, నిర్మానుష్య ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలు జరగకుండా చూడటంలో ఈ డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. కెమెరా కంటికి చిక్కకుండా ఎవరూ తప్పించుకోలేరని పోలీసులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలోని ప్రతి అంగుళాన్ని గాలిలో తేలియాడే కెమెరాలతో జల్లెడ పడుతున్నారు. శివారు ప్రాంతాల్లోని పొదలు, వాగుల వెంబడి డ్రోన్ కెమెరాల నిఘా కొనసాగుతుంది. ఎస్పీ పర్యవేక్షణలో శిక్షణ పొందిన డ్రోన్ ఆపరేటర్లు నిరంతరం దృశ్యాలను విశ్లేషిస్తూ , క్షేత్రస్థాయిలోని అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నారు.ప్రజల భద్రతే మా ప్రథమ ప్రాధాన్యత. సాంకేతికతను జోడించడం వల్ల నేరాల నియంత్రణ సులభతరం అవుతుంది. అనుమానాస్పద వ్యక్తులు కనబడితే స్థానిక పోలీస్ స్టేషనుకు లేదా 100/112కు సమాచారం ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. పోలీసుల ఈ హైటెక్ గస్తీతో నేరస్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతుండగా, సామాన్య ప్రజలు మాత్రం హర్షంవ్యక్తం చేస్తున్నారు.ఆకాశం నుంచి పహారా కాస్తున్న పోలీసుల తీరుపై జిల్లావ్యాప్తంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.




# కృషి విజ్ఞాన కేంద్రం క్షేత్ర పరిశీలన



**నిమ్మనపల్లి, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరి వారు క్షేత్ర పరిశీలనగావించారు. నిమ్మనపల్లి మండలం పడమటివరిపల్లి గ్రామంలో వేరుశనగలో రైజ్డ్ బెడ్ విత్తన గొర్రు క్షేత్ర పరిశీలన, క్షేత్ర స్థాయి సందర్శనలు కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్, హెడ్ డాక్టర్ కె మంజుల, శాస్త్రవేత్తలు వేరుశనగలో రైజ్డ్ బెడ్ విత్తన గొర్రు క్షేత్ర పరిశీలన, టమోటా, కొబ్బరి పంటలను సందర్శించి ప్రస్తుత పరిస్థితుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. ఈ సందర్భంగా వేరుశెనగ విత్తన విశిష్ట, అధిక దిగుబడి గురించి వివరించారు. ఈ సాంకేతికత వల్ల పంట పెరుగుదల బాగుందని, ఈ యంత్ర వినియోగం పట్ల రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. కొబ్బరి తోటను పరిశీలించి కొబ్బరిలో మైట్స్, రుగోస్ స్పైరలింగ్ వైట్ ఫ్లై, రైనోసిరస్ బీటిల్ వల్ల కలిగిన నష్టాన్ని గుర్తించారు. ఈ కీటకాల నివారణకు చర్యలను డా. కె. మంజుల రైతులకు సూచించారు. రైతులతో చర్చలు జరిపి, ఆధునిక వ్యవసాయ పద్ధతులు , యాంత్రికీకరణ ప్రాముఖ్యతను తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు కొత్త సాంకేతిక పరిజ్ఞానం చేరవేసి, దిగుబడి పెంపు, ఖర్చు తగ్గింపుకు దోహదం అవుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. నత్తలు, కోతులు, కుందేళ్ళు , కొబ్బరి పంటలో వివిధ చీడలకు సంబంధించి రైతుల పొలాల్లో ప్రయోగాలు కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరి తరపున చేస్తామని తెలియచేశారు.

# స్కానింగ్ సెంటరుతో రోగులకు ఇక్కట్లు



**పీలేరు, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రోగులకు సకాలంలో స్కానింగ్ రిపోర్ట్ ఇవ్వడంలో నిర్లక్ష్యంపట్ల ఓ ప్రైవేటు స్కానింగ్ సెంటర్ యాజమాన్యంపై పోలీస్ కేసు నమోదు చేయాలని నేడు పీలేరు పోలీస్ స్టేషన్ లో సర్కిల్ ఇన్స్పెక్టర్ యుగంధర్ అందుబాటులో లేకపోవడంతో సబ్ – ఇన్స్పెక్టర్ లోకేష్ కు మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7వ తేదిన రాత్రి 9 గంటల సమయంలో తమ సమీప బంధువైన లక్ష్మి నారాయణ అనే వ్యక్తి తీవ్రమైన కడుపునొప్పి రావడంతో వైద్యులసలహా మేరకు సి.టి అబడోమెన్ స్కానింగ్ కొరకు పీలేరు పట్టణం చిత్తూరు రోడ్డు మార్గంలోని ఒక ప్రైవేటు స్కానింగ్ సెంటర్ కు వెళ్లగా స్కానింగ్ కొరకు 2800 రూపాయలు తీసుకొని స్కానింగ్ తీశారు. స్కానింగ్ రిపోర్టు ఒక గంట తరువాత ఇస్తామని సిబ్బంది తెలిపారు. వైద్యులను సంప్రదించగా స్కానింగ్ రిపోర్టు చూసి చికిత్స అందిస్తామని తెలిపారు. ఎంతకీ స్కానింగ్ రిపోర్ట్ ఇవ్వకపోవడంతో అదేరోజు రాత్రి పలుమార్లు ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించకపోవడంతో నేరుగా స్కానింగ్ సెంటర్ కు వెళ్లి సిబ్బందిని అడగగా సాంకేతిక సిబ్బంది అందుబాటులో లేరని రేపు ఉదయం రిపోర్ట్ ఇస్తామని తెలిపారు. రోగికి స్కానింగ్ చేసి 12 గంటలైనా రిపోర్ట్ ఇవ్వడంలో జాప్యంపట్ల యాజమాన్యాన్ని సంప్రదించగా పొంతన లేని సమాధానాలు చెప్పారని, గతంలోనూ ఇదే తరహాలో వ్యవహరిస్తూ సకాలంలో రోగులకు స్కానింగ్ రిపోర్టులు ఇవ్వడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్న స్కానింగ్ సెంటర్ అనుమతులను రద్దు చేసి, యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని రోగుల ప్రాణాల పట్ల స్కానింగ్ సెంటర్ యాజమాన్య నిర్లక్ష్యంపై పోలీస్ కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్ పాల్గొన్నారు.

# క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన ఎస్పీ, ధీరజ్ కునుబిల్లి



**మదనపల్లె, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లెలోని బి. టి. కళాశాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రైమ్ పోలీస్ స్టేషన్ ను బుధవారం ఎస్పీ, ధీరజ్ కునుబిల్లి ప్రారంభించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ ఆయన మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో జరుగుతున్న చోరీలు, ఆస్తిపాస్తి నేరాలు (ప్రాపర్టీ అఫెన్సెస్), దీర్ఘకాలంగా పరిష్కారం కాని కేసులను వేగవంతంగా ఛేదించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక క్రైమ్ స్టేషన్‌ను తీర్చిదిద్దినట్లు తెలిపారు. క్రైమ్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ తో మాట్లాడుతూ.. నేరస్థులను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో క్రైమ్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ కె. రాజారెడ్డి, తాలూకా ఇన్స్పెక్టర్ కె.కళా వెంకటరమణ, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ ఏ. ఆదినారాయణ రెడ్డి, రెడ్ శాండిల్ టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఏ.మోహన్ కుమార్ పాల్గొన్నారు. క్రైమ్ ఎస్ఐలు నరసింహుడు, మోహన్ నాయక్, రమేష్, తాలూకా ఎస్ఐ రామకృష్ణారెడ్డి ,సిసిఎస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డేటా సైన్స్ కృత్రిమ మేధస్సు (ఏఐ)లకు డిమాండ్

**- సాగ్నిక్ బెనర్జీ**




**మదనపల్లె/ కురబలకోట,ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డేటా సైన్స్. కృత్రిమ మేధస్సు (ఏఐ) కోర్సులకు డిమాండ్ పెరుగుతోందని బెంగళూరుకు చెందిన డేటా అనలిటిక్స్ మేనేజర్, మైక్రోసాఫ్ట్ కంపెనీ సాగ్నిక్ బెనర్జీ అన్నారు. బుధవారం మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (డేటా సైన్స్) విభాగం వారు జాతీయ స్థాయిలో టెక్నికల్ సింపోసియం డిఫెస్టా – 2కే26 కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. విద్యార్థులు ముఖ్యంగా పైథాన్ ప్రోగ్రామింగ్,డేటా హ్యాండ్లింగ్, డేటా క్లీనింగ్, మిషన్ లెర్నింగ్,ఎస్ క్యూ ఎల్ వంటి టెక్నాలజీలపై పట్టు సాధించాలని సూచనలు చేశారు. సూపర్వైజ్డ్, అన్‌సూపర్వైజ్డ్ లెర్నింగ్, రియల్ టైమ్ ప్రాజెక్టుల ప్రాముఖ్యత, కో–పైలట్ వంటి ఆధునిక ఏఐ సాధనాలను ఎలా ఉపయోగించాలో విద్యార్థులకు వివరించారు. ప్రపంచం ప్రతి సెకనుకు భారీ మొత్తంలో డేటాను ఉత్పత్తి చేస్తున్నందున సంస్థలు కార్యాచరణ, కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడానికి, వ్యూహాత్మక నిర్ణయాలను నడిపించడానికి డేటా సైన్స్‌పై ఎక్కువగా ఆధారపడుతున్నా యన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మెషిన్ లెర్నింగ్ (ఎం.ఎల్) డేటా సైన్స్‌లో అంతర్భాగాలుగా మారాయని తెలిపారు. ప్రిడిక్టివ్ అనలిటిక్స్,ఆటోమేషన్, తెలివైన నిర్ణయం తీసుకోవడానికి వీలు కల్పిస్తాయని చెప్పారు. ఆరోగ్య సంరక్షణ , ఫైనాన్స్ నుండి ఇ–కామర్స్, వ్యవసాయం వరకు డేటా ఆధారిత పరిష్కారాల ఉపయోగం సమస్యలను సంప్రదించే, పరిష్కరించే విధానంలో విప్లవాత్మక మార్పులు చేస్తోందన్నారు. ప్రపంచ దేశాలతో పోల్చితే భారతదేశం డేటా వినియోగంలో ముందంజలో ఉందన్నారు. ఈ రంగాలలో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, వాటిని విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్, డీన్– స్కూలోఫ్ కంప్యూటింగ్ చంద్ర ప్రకాష్ గుప్తా, విభాగాధిపతి డాక్టర్ ఎస్.కుసుమ, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎమ్.కిరణ్ కుమార్,డాక్టర్ కే.పుగజరాసి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సచివాలయాన్ని తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్

**ఆమడగూరు, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని బుధవారం జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ రికార్డులను, సిబ్బంది పనితీరును ఆయన పరిశీలించారు. ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు, సమయపాలన, అటెండెన్స్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. ప్రతిరోజూ సచివాలయానికి ఎన్ని దరఖాస్తులు వస్తున్నాయి, ఎన్ని సేవలు గడువులోగా పరిష్కారమవుతున్నాయి, అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సేవలందించడంలో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పనులపై ఎంపీడీఓతో చర్చించారు. కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జలధార' , 'జలహారతి' కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. నీటి సంరక్షణ పనులు , తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సచివాలయ వ్యవస్థ పనిచేయాలని, ఇందులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జేసీ హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపీడీఓ, సచివాలయ ఈఓడీఓ , ఇతర సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## చిరు వ్యాపారమే మా జీవనాధారం

**- తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శులకు వినతి**



**ములకలచెరువు,ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రోడ్డు పక్కన చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని కుటుంబాలను పోషించు కుంటున్నామని, తమను ఖాళీ చేయించడం సరికాదని, తంబళ్లపల్లి నియోజకవర్గం ములకలచెరువు మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన ఫుట్ పాత్ పై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుం టున్న వారు బుధవారం మండల డిప్యూటీ తాసిల్దార్, ములకలచెరువు గ్రామపంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 100 మందికి పైగా పేద కుటుంబాలకు చెందిన తాము 40 సంవత్సరాలుగా రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకొని, బ్రతుకుతున్నామని, తరచూ పంచాయతీ, రెవెన్యూ, నేషనల్ హైవే వారు మమ్మల్ని వ్యాపారాలు ఫుట్పాత్ పై చేసుకోకూడదని, ఖాళీ చేయాలని, ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిపారు. తాము వ్యాపారాలు చేసుకునేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి, మండల తాసిల్దార్, నేషనల్ హైవే డి ఈ వారికి అర్జీల ద్వారా విన్నవించు కున్నట్లు తెలిపారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రోడ్లు భవనాలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిలకు లేఖలు పంపినట్లు తెలిపారు.

## ఉపాధి హామీ పనులు వేగవంతంగా జరగాలి

**- వందశాతం కూలీలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలి**

**- డ్వామా పిడీ వెంకటరత్నం**

**ములకలచెరువు , ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తంబళ్లపల్లి నియోజకవర్గంలోనీ ఆరు మండలాలలో ఉపాధి పనులు వేగవంతంగా జరగాలని, నూరు శాతం పనులకు కూలీలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డ్రామా పీడీ వెంకటరత్నం తెలిపారు. బుధవారం ములకలచెరువు మండల కేంద్రంలోని సిఎల్ఆర్సి భవనంలో బి.కొత్తకోట, ములకలచెరువు, పిటిఎం, తంబళ్లపల్లి, పెద్దమండెం, కురబలకోట మండలాలకు చెందిన ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 66 వేల మంది కూలీలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో పనులు చేపట్టగా, 26 వేల మంది మాత్రమే ఉపాధి హామీ పనులు చేస్తున్నట్లు తెలిపారు. మొలకలచెరువు క్లస్టర్ పరిధిలో10895 మంది కూలీలు పనులకు హాజరు కావాల్సి ఉండగా, 3963 మంది కూలీలు మాత్రం హాజరవుతున్నట్లు తెలిపారు. కూలీలలో పనులపై అవగాహన కల్పించి నూరు శాతం కూలీలు పన్నులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. కూలీలకు 26 రకాల పనులు కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏపీడి చందన, ఆరు మండలాలకు చెందిన ఏపీవోలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# సంతానం లేని దంపతులకు శుభవార్త

**- ఈనెల 24, 25న ఉచిత సంతాన సాఫల్య శిబిరం**

**- సొసైటీ కాలనీ శ్రీ మారుతి హెల్త్ హోమ్ వద్ద క్యాంపు**

**- డాక్టర్లు ప్రశాంత్, శ్రీదేవి, సంహిత ఆధ్వర్యంలో చికిత్సలు**



**మదనపల్లె, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సంతానం లేని దంపతులకు ఈ నెల 24, 25న ఉచిత సంతాన సాఫల్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్. శ్రీదేవి తెలిపారు. సొసైటీ కాలనీలోని, శ్రీ మారుతి హెల్త్ హోమ్ వద్ద డాక్టర్ శ్రీదేవి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతినెల పిల్లలు లేని స్త్రీలకు ఐయూఐ, ఐవిఎఫ్, ఐసిఎస్ఐ, ఐఎంఎస్ఐ వంటి పద్ధతిలో వీర్య కణాలు, అండాలను నిల్వ చేసుకునే సదుపాయం ద్వారా చికిత్సలు అందించి సంతానం కలిగేలా ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. అండాల సంఖ్య తక్కువగా ఉన్న వారికి చికిత్స, గర్భసంచిలో, అండాశయంలో కణితులు, ట్యూబ్స్ మూసుకుపోవుటకు చికిత్స, జెనెటిక్ స్క్రీనింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇక పురుషులకు సంబంధించి ఆండ్రాలజీ, సెక్స్ సామర్థ్యం పెంపుదల, వీర్యకణాల సంఖ్య లేకుండా ఉండు వారికి చికిత్స, 40 ఎక్స్ మైక్రోస్కోప్ ద్వారా వృషణాల బయాప్సి, వేరికొసెల్ సర్జరీ, కారియోటైపింగ్ వంటి మెరుగైన చికిత్సలు అందించి సంతానం కలిగేలా చేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేక వైద్య నిపుణుల ఉచిత ఓపి, కన్సల్టేషన్, ఉచిత స్కానింగ్, ఉచిత వీర్య పరీక్షలు, అన్ని రకముల ఐవీఎఫ్ ప్యాకేజీలపై ప్రత్యేక డిస్కౌంట్, ఫెర్టిలిటీ కౌన్సిలింగ్ ( సంతాన సమస్యలకు)వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉచిత సంతాన సాఫల్య శిబిరం చెన్నైలోని ఫెర్టిలిటీ రీసెర్చ్ సెంటర్ డాక్టర్ ప్రశాంత్, డాక్టర్. సంహిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. మారుతి హెల్త్ హోమ్ ( శ్రీదేవి హాస్పిటల్) వద్ద ఈ ఉచిత సంతాన సాఫల్య శిబిరము నిర్వహిస్తున్నట్లు ఆమె తెలియజేశారు.

# పల్లగిరి పంచాయతీకి స్పెషల్ ఆఫీసర్‌గా ఆర్వీఎస్ ప్రసాదరావు బాధ్యతలు...



**నందిగామ ఏప్రిల్ 08( నేటి మనదేశమ్ (ప్రతినిధి) :** నందిగామ మండలంలోని పల్లగిరి గ్రామ పంచాయతీకి ఎంపీడీవో ఆర్వీఎస్ ప్రసాదరావు స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది హాజరు పట్టికలు, రికార్డులను పరిశీలించి పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలు విధానాన్ని తెలుసుకుని, సేవలు ప్రజలకు సమయానికి అందుతున్నాయా అనే అంశంపై వివరాలు సేకరించారు. అనంతరం గ్రామంలోని వెల్నెస్ సెంటర్‌ను పరిశీలించి ఆరోగ్య సేవల అందుబాటుపై ఆరా తీశారు. క్యాటిల్ షెడ్, వాటర్ ట్యాంక్, నాభొజ షెడ్లను తనిఖీ చేసి వాటి నిర్వహణ స్థితిని పరిశీలించారు. మౌలిక సదుపాయాల వినియోగంపై సిబ్బందిని ప్రశ్నిస్తూ లోపాలపై సూచనలు చేశారు. పరిశీలించిన అన్ని వివరాలను వెంటనే ×+చీ×ుజు యాప్‌లో నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి సమయపాలన అత్యంత ముఖ్యమని, ప్రజలకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం అస్సలు సహించబోమని స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగి తన బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వహించాలని, ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటించాలని సూచించారు. గ్రామ అభివృద్ధి కోసం అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆర్వీఎస్ ప్రసాదరావు తెలిపారు.

# ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

## : ఎమ్మెల్యే ముప్పిడి



**తాళ్లపూడి ఏప్రిల్ 08( నేటి మనదేశమ్ (ప్రతినిధి) :** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని మలకపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుతో పాటు ధాన్యం లోడుకు జెండా ఊపి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, కలెక్టర్ కీర్తి చేకూరి ప్రారంభించారు. నవధాన్యాల కిట్లను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. టీబీ వ్యాధిపై అవగాహన కల్పించే గోడపత్రికలను ఆవిష్కరించారు. పెద్దేవంలోని చెరువును బాగుచేయాలని గ్రామానికి చెందిన పలువురు కలెక్టర్ కీర్తికి వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గత ఏడాది ముఖ్యమంత్రి చంద్రబాబు మలకపల్లి గ్రామానికి వచ్చినప్పుడు పలు అభివృద్ధికి సంబంధించిన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. సరిపడా గోనెసంచులు, సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. ఎస్సీ, ఎస్టీ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో 68 సోలార్ పవర్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో 4,704 మంది దరఖాస్తు చేసుకున్నారని.. దశల వారీగా యూనిట్లు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం పెద్దేవం గ్రామానికి చెందిన ఒకరికి సీఎం సహాయనిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

# భాజపా బలోపేతానికి కృషి చేయాలి: ఎంపీ సీఎం రమేష్



**అనకాపల్లి ఏప్రిల్ 08( నేటి మనదేశమ్ (ప్రతినిధి) :** భారతీయ జనతా పార్టీ (భాజపా) బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ అన్నారు. ఎంపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పార్టీ క్రియాశీల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత నమోదును చురుగ్గా చేపట్టాలని సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, పార్టీ నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

# మారుటేరులో శారదామృత సేవా ట్రస్ట్ సేవలు

## : అన్నదానం, వస్త్రాల పంపిణీ



**ఆచంట ఏప్రిల్ 08( నేటి మనదేశమ్ (ప్రతినిధి) :** ఏప్రిల్ 8న పశ్చిమ గోదావరి జిల్లా మారుటేరులో శారదామృత సేవా ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా అన్నదానం, గో సేవ, వస్త్రాల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ట్రస్ట్ ప్రారంభం నుంచి వేలాది మందికి అన్నదానం, గోవులకు కూరగాయలు, వానరాలకు అరటిపండ్లు అందిం చింది. యాచకులు, దివ్యాంగులు, వృద్ధులకు రగ్గులు, చీరలు పంపిణీ చేయడంతో పాటు వైద్య సహాయం కూడా అందించారు. సేవే లక్ష్యమని ట్రస్ట్ ఫౌండర్ డా. వి సత్యహరి తెలిపారు. విరాళాలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని వెల్లడించారు.

# రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణి చేసిన ఎమ్మెల్యే



**ఆచంట ఏప్రిల్ 08( నేటి మనదేశమ్ (ప్రతినిధి) :**పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం తోలేరు రైతు సేవ కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. భూ రీసర్వే ప్రాజెక్టులో భాగంగా సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ పుస్తకాలు అందిస్తున్నట్లు, దీని ద్వారా రైతులకు తమ భూములపై శాశ్వత హక్కులు లభిస్తాయని ఆయన తెలిపారు.

# తిరుమలగిరిలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగింపు...



**నందిగామ ఏప్రిల్ 08( నేటి మనదేశమ్ (ప్రతినిధి) :** జగ్గయ్యపేట మండలంలోని తిరుమలగిరి గ్రామంలో శ్రీవేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య విజయవంతంగా ముగిశాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. అర్చక స్వాములు శాస్త్రోక్తంగా శ్రీ స్వామివారి దేవేరుల పవళింపు సేవను నిర్వహించారు. ఈ సేవను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం ఆలయ పరిసరాల్లో ద్వాదశ ప్రదక్షిణాలు నిర్వహించగా భక్తులు భక్తి పారవశ్యంతో పాల్గొన్నారు. మహిళలకు అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలను పంపిణీ చేయడం విశేషంగా నిలిచింది. ఉత్సవాల సందర్భంగా వేద మంత్రోచ్చారణలు, భజనలు, ప్రత్యేక పూజలు భక్తులను ఆకట్టుకున్నాయి. గ్రామ ప్రజలు, భక్తులు సమిష్టిగా పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో కార్యక్రమాలు సాగడం విశేషం. మొత్తం మీద ఈ బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పి భక్తుల్లో ఆనందాన్ని నింపాయి.

# అక్రమ ఇసుక రవాణా

## : 11 మందిపై వాల్టా కేసు...



**నందిగామ ఏప్రిల్ 08( నేటి మనదేశమ్ (ప్రతినిధి) :** తెలంగాణకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నలుగురు లారీ యజమానులు, ఏడుగురు డ్రైవర్లపై చిల్లకల్లు పోలీసులు వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేశారు. జగ్గయ్యపేట మండలం గరికపాడు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా ఉన్న నాలుగు ఇసుక లారీలను పోలీసులు ఆపి తనిఖీ చేశారు. సరైన అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నందిగామ సమీపంలోని అంబారుపేట వద్ద అక్రమంగా ఇసుక డంప్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి తెలంగాణకు తరలిస్తున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో నిందితులపై వాల్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు.

# చెక్‌పోస్టులో పోలీసుల దాడి: కోట్లు పట్టివేత



**విజయవాడ , ఏప్రిల్ 08( నేటి మనదేశమ్ (ప్రతినిధి) :** విజయవాడ నగరంలోని గుణదల ప్రాంతంలో హవాలా డబ్బు కేసు వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో సుమారు రూ.2 కోట్లకు పైగా నగదు పట్టుబడింది. ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా నగదు తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు అనుమానాస్పదంగా వెళ్తున్న కారును ఆపి తనిఖీ చేయగా ఈ వ్యవహారం బయటపడింది. వెంటనే నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ఐదుగురిని అరెస్ట్ చేసి, డబ్బు తరలించడానికి ఉపయోగించిన కారును సీజ్ చేశారు. స్వాధీనం చేసిన నగదును తదుపరి విచారణ కోసం ఆదాయపు పన్ను అధికారులకు అప్పగించారు. హవాలా నెట్‌వర్క్‌పై పోలీసులు లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# వేసవిలో తాగునీటి ఎద్దడి నివారిస్తాం: ఎంపీడీవో




**హొలహర్వి ఏప్రిల్ 08( నేటి మనదేశమ్ (ప్రతినిధి) :** వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వరలక్ష్మి తెలిపారు. బుధవారం హొలహర్వి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నెట్టికంటమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

# 2027 నాటికి పోలవరం పూర్తి చేస్తాం: మంత్రి అచ్చెన్నాయుడు



**పెనుమంట్ర ఏప్రిల్ 08( నేటి మనదేశమ్ (ప్రతినిధి) :** పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని 2027 నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. పెనుమంట్ర మండలం మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థలో నిర్వహించిన 'మారుతున్న వాతావరణ పరిస్థితులు – సుస్థిర వరి వ్యవసాయం' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. గత ఐదేళ్లలో గోదావరి జిల్లాల్లో కాలువలో కనీసం మట్టి తీయలేదని అన్నారు. గత ఐదేళ్లలో చేసిన రూ. 12 లక్షల కోట్ల అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను దాదాపు నెరవేర్చామని, ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, భాజపా రాజ్యసభ ఎంపీ పాకా సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు.

# సెలూన్ షాపు నిర్వాహకుడికి జీఎస్టీ నోటీసులు



**విజయవాడ , ఏప్రిల్ 08( నేటి మన దేశమ్ (ప్రతినిధి) :** విజయవాడలోని పంజా సెంటర్‌కు చెందిన పైడాడ శ్రీనివాసరావు అనే వ్యక్తి దాదాపు 40 ఏళ్లుగా సెలూన్ షాపును నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఆయనకు రూ.72 లక్షల జీఎస్టీ చెల్లించాలని నోటీసులు రావడంతో ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. విశాఖపట్నంలో స్క్రాప్ ఐరన్ వ్యాపారం జరిగినట్లు రికార్డులు చూపిస్తూ జీఎస్టీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఇటీవల ఆయన బ్యాంక్ ఖాతా నిలిపివేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బ్యాంకుకు వెళ్లి విచారించగా.. జీఎస్టీ అధికారుల ఆదేశాల మేరకు ఖాతాను హోల్డ్ చేసినట్లు బ్యాంక్ సిబ్బంది తెలిపారు. విశాఖపట్నం వెళ్లి జీఎస్టీ అధికారులను కలవాలని బ్యాంక్ అధికారులు సూచించారు. తనకు ఎటువంటి ఐరన్ వ్యాపారం లేదని శ్రీనివాసరావు వాపోయారు. చిన్ననాటి నుంచి సెలూన్ షాపు మాత్రమే నిర్వహిస్తున్నానని చెప్పినా అధికారులు స్పందించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనివాసరావుకు తెలియకుండానే ఆయన ఆధార్, పాన్ కార్డు వంటి వ్యక్తిగత పత్రాలను కొందరు కేటుగాళ్లు తస్కరించి, వాటితో దొంగ వ్యాపారాలు సృష్టించి ఉంటారని స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ గొడవ వల్ల ప్రస్తుతం ఆయనకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా నిలిచిపోయాయి. న్యాయం కోసం, తన నిజాయితీని నిరూపించుకోవడం కోసం ఆ బాధితుడు ఇప్పుడు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

# ఇంజక్షన్ బావులను పరిశీలించిన కృష్ణా జిల్లా కలెక్టర్



**పెదపాడు ఏప్రిల్ 08( నేటి మనదేశమ్ (ప్రతినిధి) :** ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి జిల్లాలోని అన్ని చెరువులను నింపి రైతులకు భరోసా కల్పించడమే జల ధారా నీటి భద్రత కార్యక్రమం ముఖ్య లక్ష్యం అని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. ఏలూరు జిల్లాలోని పెదవేగి మండలం జగన్నాథపురం రెవెన్యూ గ్రామంలోని బాణంపేటలో చెరువు పక్కన రైతు పర్వతనేని బాబ్జి సొంతంగా నిర్మించుకున్న ఇంజక్షన్ బావులను కలెక్టర్ బాలాజీ బుధవారం పరిశీలించారు. ఆ ఇంజక్షన్ బావులను నిర్మించిన తీరుపై రైతును అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షపు నీటిని ఒడిసి పట్టి అన్ని చెరువులను నింపాలని, తద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సాగునీరు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలోనే జల ధార.. నీటి భద్రత కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. కృష్ణాజిల్లాలో భూగర్భ జలాల మట్టం తక్కువ ఉన్న ప్రాంతాల్లో జలాలను పైకి తీసుకుని వచ్చి మెరుగుపరచడానికి ఏ విధమైన చర్యలు తీసుకోవాలో అధ్యయనం చేసేందుకు ఏలూరు జిల్లా బాణం పేటకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఇంజక్షన్ బావులు చాలా బాగున్నాయని.. ఇటువంటి నిర్మాణాలు కృష్ణా జిల్లాలో కూడా ఏర్పాటు చేసుకొని భూగర్భ జలాల పెరుగుదలకు కృషి చేస్తామన్నారు.

# ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు.. ఆటో సీజ్ చేసిన సీఐ



**మైలవరం ఏప్రిల్ 08( నేటి మనదేశమ్ (ప్రతినిధి) :** మైలవరం పట్టణంలో బుధవారం వాహనాల తనిఖీల్లో భాగంగా, సీఐ కిషోర్ బాబు ఒక ఆటో రిక్షాను అదుపులోకి తీసుకుని సీజ్ చేశారు. డ్రైవర్ వద్ద చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేదని గుర్తించారు. దీనితో భారీ జరిమానా విధించారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి, అదనపు డబ్బు సంపాదించేందుకు ఇలాంటి నిర్లక్ష్య చర్యలకు పాల్పడే ఆటో డ్రైవర్లపై కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

# మద్యం బెల్టు షాపులకు అమ్మితే లైసెన్స్ రద్దు



**ఈపూరు ఏప్రిల్ 08( నేటి మనదేశమ్ (ప్రతినిధి) :** ఈపూరు మండలంలోని ముప్పాళ్ళ, మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని మద్యం దుకాణాలను ప్రొహిబిషన్ ఉ ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో రికార్డుల ప్రకారం స్టాక్, బిల్లు నమోదులను పరిశీలించారు. నిర్దేశిత సమయాల్లోనే దుకాణాలు తెరిచి ఉండాలని, అధిక ధరలకు అమ్మకాలు జరిపినా, బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే మూసివేత, లైసెన్స్ రద్దు, క్రిమినల్ కేసులు వంటి చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# సీతారామంలో చేసిన అన్యాయానికి బదులు





బాలీవుడ్ భామ మృణాల్ ఠాకూర్ తన కెరీర్లో ఎన్ని సినిమాలైనా చేయనీ.. సీతారామం చిత్రంలో ఆమె పోషించిన సీతామాలక్ష్మి పాత్ర మాత్రం చాలా చాలా స్పెషల్. అదొక కల్పిత పాత్ర అయినా.. ఆమె సినిమాలో మాత్రమే సీతామాలక్ష్మి అయినా.. నిజంగా అలాంటి ఓ అమ్మాయి ఉన్నట్లు, రామ్ దూరం కావడంతో ఆమెకు తీవ్ర అన్యాయం జరిగినట్లు ఫీలైపోతుంటారు జనం.లె జెండరీ డైరెక్టర్ రాఘవేంద్రరావు సైతం.. ఒక సందర్భంలో రామ్, సీత దూరం కావడం గురించి బాధ పడుతూ, ఈ సినిమాకు సీక్వెల్ తీసి ఇద్దరినీ కలిపేయండని ఈ చిత్ర బృందాన్ని కోరడం గమనార్హం. తాజాగా సీతారామంలో ఆర్మీ మేజర్ విష్ణు శర్మగా కీలక పాత్ర చేసిన సుమంత్.. ఆ సినిమాలో సీతామాలక్ష్మికి చేసిన అన్యాయానికి గాను మృణాల్ ఠాకూర్‌కు స్టేజ్ మీది నుంచి సారీ చెప్పాడు. మృణాల్ కథానాయికగా నటించిన డెకాయిట్ సినిమా ప్రి రిలీజ్ ఈవెంట్‌కు అతిథిగా వచ్చిన సుమంత్.. సీతారామం ప్రస్తావన తెచ్చాడు. ఆ సినిమాలో రామ్‌ను దూరం చేసినందుకు గాను తాను సీతకు క్షమాపణలు చెప్పానని.. ఆ నేపథ్యంలో ఒక సన్నివేశం తీశారని.. కానీ ఎడిటింగ్‌లో భాగంగా, తప్పనిసరి పరిస్థితుల్లో ఆ సన్నివేశం తీసేశారని సుమంత్ వెల్లడించాడు. కాబట్టి ఆ సినిమాలో సీతకు క్షమాపణలు చెప్పలేకపోయినందుకు.. ఇప్పుడు ఈ స్టేజ్ మీది నుంచి సీతకు మనస్ఫూర్తిగా సారీ చెబుతున్నానని సుమంత్ వ్యాఖ్యానించాడు. అంతే కాక.. సీతారామంలో చేసిన అన్యాయానికి బదులుగా తన చెల్లెలు సుప్రియ ప్రొడ్యూస్ చేసిన డెకాయిట్ మూవీలో మృణాల్‌కు అవకాశం ఇప్పించానని కూడా సుమంత్ వ్యాఖ్యానించాడు. సీతారామం లాగే డెకాయిట్ సైతం మృణాల్ కెరీర్లో మైల్‌స్టోన్ మూవీగా నిలుస్తుందని సుమంత్ ధీమా వ్యక్తం చేశాడు. ఇక తన చెల్లెలు సుప్రియ గురించి మాట్లాడుతూ.. ఆమెను అందరూ వైలెంట్ ప్రొడ్యూసర్ అనుకుంటారని.. కానీ అది నిజం కాదని, ఆమె మనసు వెన్న అని సుమంత్ పేర్కొన్నాడు. డెకాయిట్ ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే.




# అల్లరి నరేష్.. ఇప్పుడు ఇలా..



ఒకప్పుడు తెలుగు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించి, ప్రతి ఇంట్లోనూ అభిమానులను సంపాదించుకున్న నటుడు అల్లరి నరేష్. తన తొలి చిత్రం 'అల్లరి' సర్ప్రైజ్ హిట్ అయి, తన ఇంటి పేరుగా మారిపోయింది. తర్వాత ఎన్నో కామెడీ సినిమాలతో అతను అలరించాడు. ఒక దశాబ్దం పాటు నరేష్‌కు ఎదురే లేకపోయింది. నరేష్ సినిమాలంటే కడుపుబ్బ నవ్వుకోవచ్చని అన్ని వర్గాల ప్రేక్షకులూ థియేటర్లకు వెళ్లేవాళ్లు. తన ఫ్లాప్ సినిమాలు కూడా డబ్బులు తెచ్చిపెట్టేవి. నిర్మాతల పాలిట కల్ప తరువులా ఉండేవాడు నరేష్. తనతో సినిమా తీస్తే మినిమం గ్యారెంటీ అన్నట్లుండేది. కానీ ఒక దశ దాటాక తన కామెడీ సినిమాలు జనాలకు మొహం మొత్తేయడం మొదలుపెట్టింది. దీంతో వరుస ఫ్లాపులు ఎదురై కామెడీనే వదిలేయాల్సిన పరిస్థితి తలెత్తింది. కొన్నేళ్ల ముందు రూటు మార్చి 'నాంది' రూపంలో పూర్తి సీరియస్ మూవీ చేశాడు నరేష్. అది మంచి ఫలితాన్నందుకుంది కానీ.. తర్వాత చేసిన ఈ తరహా సినిమాలేవీ ఫలితాన్నివ్వలేదు. ఉగ్రం, ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం, ఆ ఒక్కటీ అడక్కు, 12 ఏ రైల్వే కాలనీ.. ఇలా ప్రతి సినిమా ఫ్లాపే అయింది. దీంతో ఇప్పుడు ఏం చేయాలో పాలుపోని స్థితికి చేరుకున్నాడు అల్లరోడు. తన చివరి సినిమా 'ఆల్కహాల్' విడుదలకే నోచుకోకుండా పక్కన పడిపోయింది. దాని సంగతేమో తేల్చకుండా నరేష్ కొత్త సినిమాను మొదలుపెట్టాడు. ఆ చిత్రమే.. కనకదుర్గ. ఈసారి సక్సెస్ కోసం నరేష్ ఇంకో రూట్లోకి వెళ్తున్నాడు. టైటిల్‌కు తగ్గట్లే ఇది భక్తి రస చిత్రమట. నరేష్ నుంచి ఇలాంటి సినిమాను అస్సలు ఊహించలేం. కానీ ఇప్పుడు దేవుడు వెర్సస్ దుష్టశక్తి అంటే జనం ఊగిపోతున్నారని ఈ రూట్లోకి వెళ్తున్నట్లుంది. ఈ చిత్రానికి సీనియర్ రైటర్ బీవీఎస్ రవి కథ అందించడం విశేషం. చిత్ర నిర్మాతల్లో కూడా ఆయనొకరు. సత్యదేవ్‌తో '47 డేస్' అనే సినిమా, నరేష్ అగస్త్యతో 'వికటకవి' అనే వెబ్ సిరీస్ తీసిన ప్రదీప్ మద్దాలి ఈ చిత్రానికి దర్శకుడు. కాజల్ చౌదరి అనే కొత్తమ్మాయి కథానాయికగా నటిస్తోంది. మరి ఈ ప్రయత్నమైనా అల్లరి నరేష్‌కు విజయాన్నిస్తుందేమో చూడాలి.

# 'వారణాసి' ట్రాక్‌లోనే ఉన్నట్లే..

ఇప్పుడు ఇండియన్ సినిమాలో తెరకెక్కుతున్న చిత్రాల్లో మోస్ట్ అవైటెడ్ అంటే.. 'వారణాసి'నే. ఎన్నడూ లేని విధంగా ఒక ఇండియన్ సినిమా కోసం హాలీవుడ్ ప్రముఖులు కూడా ఎదురు చూడడం ఈ చిత్రానికే జరుగుతోంది. 'ఆర్ఆర్ఆర్'తో ఇంటర్నేషనల్ ఆడియన్స్‌ను మెప్పించడం ద్వారా తన కొత్త చిత్రంపై వాళ్లూ అంచనాలు పెట్టుకునేలా చేశాడు రాజమౌళి. రామాయణ గాథ జరిగిన త్రేతాయుగానికి.. భవిష్యత్ కాలమానానికి.. ఇంకా అనేక అంశాలకు ముడిపెడుతూ వెండితెరపై ఒక అద్భుతాన్ని ఆవిష్కరించేలా ఉన్నాడు జక్కన్న. ఇలాంటి భారీ చిత్రంలో విలన్ పాత్ర చేసే అవకాశం మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌ను వరించింది. ఈ చిత్రంలో అతను కుంభా అనే పాత్రలో కనిపించనున్న సంగతి తెలిసిందే. గత ఏడాది రిలీజ్ చేసిన తన ఫస్ట్ లుక్ మిశ్రమ స్పందన తెచ్చుకున్నప్పటికీ.. రాజమౌళి ఈ పాత్రను ఆషామాషీగా తీర్చిదిద్ది ఉండడనే భావిస్తున్నారు. ఈ సినిమా విడుదలకు ఏడాది సమయం ఉండగానే పృథ్వీరాజ్ పాత్రకు సంబంధించి చిత్రీకరణ పూర్తి కావడం విశేషం. ఈ విషయాన్ని స్వయంగా పృథ్వీరాజే ఇన్‌స్టాగ్రామ్ పోస్టు ద్వారా వెల్లడించాడు. తన పాత్రకు సంబంధించిన షెడ్యూల్ పూర్తయిందని వెల్లడించిన పృథ్వీరాజ్.. ఇక తాను చీట్ మీల్ తినడానికి సమయం ఆసన్నమైందంటూ ఈ చిత్ర నిర్మాత కేఎల్ నారాయణ ఏర్పాటు చేసిన విందుకు సంబంధించిన ఫొటోను షేర్ చేసి ఆయనకు థ్యాంక్స్ చెప్పాడు. పృథ్వీరాజ్ ఇచ్చిన అప్‌డేట్.. 'వారణాసి' రిలీజ్ డేట్ అందుకునేలా ట్రాక్‌లోనే ఉందనడానికి ఇండికేషన్‌లా భావించవచ్చు. 'వారణాసి' భారీగా విజువల్ ఎఫెక్ట్స్‌తో ముడిపడ్డ చిత్రం.






కాబట్టి పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలకు చాలా టైం పడుతుంది. ఈ పాటికే వీఎఫెక్స్ పని మొదలు కాగా.. వాటిని సమయానికి ఒక కొలిక్కి తేవాలంటే, మిగతా పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలనీ ప్లాన్ ప్రకారం నడవాలి అంటే.. సినిమా విడుదలకు కనీసం ఆరు నెలల ముందు షూట్ మొత్తం పూర్తి చేసి ఉండాలి. ఆ లక్ష్యం దిశగా పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్నాడు జక్కన్న. ఈ ఏడాది ఆగస్టుకల్లా షూట్ పూర్తి కావచ్చని అంచనా వేస్తున్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న 'వారణాసి' విడుదల కానున్న సంగతి తెలిసిందే.



# బిజినెస్ న్యూస్



## సీజ్ ఫైర్ ఎఫెక్ట్.. 15 లక్షల కోట్లు పెరిగిన మదుపర్ల సంపద

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. ఇరాన్-అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం, అంతర్జాతీయంగా చమురు ధరలు అమాంతం పడిపోవడంతో సూచీలు (ాశీఏ మీుతీఎవ్) దూసుకెళ్లాయి. సెన్సెక్స్ ఏకంగా 2900 పాయింట్లకు పైగా ఎగబాకగా.. నిఫ్టీ ఓ దశలో 24 వేల మార్కును తాకింది. చివరికి 24వేల మార్కుకు కాస్త దూరంలో నిలిచింది. దీంతో మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.15 లక్షల కోట్లు పెరిగి రూ.445 లక్షల కోట్లకు చేరింది. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాల నేపథ్యంలో సెన్సెక్స్ ఉదయం 77,290.63 వద్ద (క్రితం ముగింపు 74,616.58) భారీ లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అవే లాభాలు కొనసాగాయి. ఇంట్రాడేలో 77,627.15 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 2946.32 పాయింట్ల లాభంతో 77,562.90 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 24,025.15 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 873.70 పాయింట్ల లాభంతో 23,995.45 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.59గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ స్టాక్స్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. ఇండిగో టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, మారుతీ, అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్అండ్‌టీ, ఇండిగో స్టాక్స్ 5 నుంచి 8 శాతం మేర లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 94 డాలర్ల వద్ద



కొనసగుతుండగా.. బంగారం 4788 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అటు ఆసియా-పసిఫిక్ మార్కెట్లు కూడా బుధవారం లాభాల్లో కొనసాగుతున్నాయి. దక్షిణ కొరియా కోస్పి 6 శాతానికి పైగా పెరిగింది. జపాన్ నిక్కీ 5శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 3 శాతం మేర పెరిగాయి. అమెరికా మార్కెట్లు మంగళవారం లాభాల్లో ముగిశాయి.

మార్కెట్ల ర్యాలీకి కారణాలివే..

ఇరాన్-అమెరికా మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణకు ఒప్పందం కుదిరింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొలిక్కి వచ్చే అవకాశం ఉందన్న అంచనాలను మార్కెట్ సెంటిమెంట్‌ను బలపర్చాయి.

ఇటీవల 95 డాలర్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన రూపాయి ఆర్‌బీఐ చర్యలతో కోలుకుంది. నేటి ట్రేడింగ్‌లో 47 పైసలు పెరిగి 92.59కు చేరుకుంది.

ట్రంప్ సీజ్‌ఫైర్‌తో అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ ధర ఈ ఒక్క రోజే దాదాపు 16 శాతం తగ్గి 95.06కు పడిపోయింది. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడ్ దాదాపు 20 శాతం తగ్గింది.

వృద్ధికి ఆటంకాలు, ద్రవ్యోల్బణ భయాలు ఉన్నప్పటికీ ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను పెంచకుండా ఉండటం కూడా స్టాక్ మార్కెట్లకు కలిసొచ్చింది.

## అమెజాన్‌లో మళ్లీ 14వేల లేఆఫ్‌లు..



ఇంటర్నెట్ డెస్క్: ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి పెద్దఎత్తున ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది వచ్చే నెలలో దాదాపు 14వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ఆసియా బిజినెస్ అవుట్‌లుక్ వెల్లడించింది. మేలో చేపట్టనున్న ఈ తొలగింపుల్లో అమెజాన్ వెబ్ సర్వీసెస్, రిటైల్‌తో పాటు మానవ వనరుల విభాగాలలోని ఉద్యోగులపై ప్రభావం పడనుందని నివేదికలు తెలిపాయి. అయితే ఈ విషయంపై అమెజాన్ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. 2025 చివరి నాటికి అమెజాన్ 14వేల ఉద్యోగులను తొలగించగా.. ఈ ఏడాది జనవరిలో 16వేల మందిపై వేటు వేసింది. ఇటీవల వేలాది మంది ఉద్యోగులను తొలగించిన కంపెనీల్లో ఒరాకిల్, మైక్రోసాఫ్ట్, టీసీఎస్, యాక్సెంచర్ ఉన్నాయి. మెటా సైతం 15వేలమంది ఉద్యోగులను తొలగించడానికి యోచిస్తున్నట్టు సమాచారం. ఇదీ చదవండి: పెరగనున్న హ్యూందాయ్ కార్ల ధరలు

## వరుసగా రెండోసారి.. ఆర్‌బీఐ వడ్డీరేట్లలో మార్పుల్లేవ్



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈమేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ నిర్వహించిన తొలి ద్వైమాసిక సమీక్ష ఇదే. ఫిబ్రవరిలో జరిగిన సమీక్షలోనూ ఈ వడ్డీరేట్లను ఆర్‌బీఐ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది.

ఆర్‌బీఐ ప్రసంగంలోని కీలక అంశాలివే..

ప్రపంచ ఆర్థికవ్యవస్థకు అనూహ్య సవాళ్లు ఎదురవుతున్నాయి. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు వృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయి.

2026-27 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.9 శాతంగా నమోదుకావొచ్చని అంచనా వేస్తున్నాం.

చమురు ధరల్లో పెరుగుదల ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం 4.6 శాతంగా ఉండొచ్చు. ఏప్రిల్ 3వ తేదీ నాటికి భారత ఫారెక్స్ నిల్వలు 696.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

## పెరగనున్న హ్యూందాయ్ కార్ల ధరలు




దక్షిణకొరియా ఆటో మొబైల్ దిగ్గజం హ్యూందాయ్ మోటార్ కార్లపై ధరలు పెంచనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు అన్నిరకాల మోడళ్లపై 1శాతం వరకు ధర పెంచుతున్నట్టు, కొత్త ధరలు మే నుంచి అమల్లోకి రానున్నట్టు పేర్కొన్నారు. "వివిధ వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ధరల సవరణ చేపట్టాల్సి వచ్చింది. కార్లలో వేరియంట్లు, మోడళ్ల ఆధారంగా వాటి ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. వినియోగదారులపై భారం మోపాలనే ఉద్దేశం సంస్థకు లేదు. అందువల్లే స్వల్ప మొత్తంలో ధరలు పెంచేందుకు ప్రణాళిక రూపొందించాం" అని ఆటో మొబైల్ సంస్థ పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో నాలుగో త్రైమాసికంలో 2,08,275 యూనిట్లు అమ్ముడయ్యాయి. గత త్రైమాసికంతో పోలిస్తే ఇది 8.7శాతం ఎక్కువ. ఇప్పటివరకు దేశీయంగా జరిగిన విక్రయాల్లో ఇదే రికార్డు అని కార్ల తయారీ సంస్థ హ్యూందాయ్ తెలిపింది.

# నిత్యాన్నదానానికి విరాళం



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8 (నేటి మనదేశం ప్రతినిధి):** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి బెంగళూరు చెందిన వనరాజు పేరిట పది వేలు విరాళం గా ఇచ్చారు. ఈ మేరకు చెక్కును చిట్టి వేలు సుకుమార్ ఆధ్వర్యంలో ఆలయ అధికారులకు అందజేశారు. వీరికి స్వామి అమ్మ వార్ల దర్శనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

# ఉచిత హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

**తిరుపతి, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లాలోని అక్రిడిటేషన్ గల జర్నలిస్టులు , వారి కుటుంబ సభ్యులు ఉచిత హెల్త్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలని డిఐపిఆర్ఓ గురుస్వామి చెట్టి కోరారు. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో అక్రెడిటేషన్ వున్న పాత్రికేయులకు ఈ నెల 10 వ తేదీ వరకు అమర ఆసుపత్రి, కరకంబాడి వారి సౌజన్యంతో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్న సంగతిని ఆయన గుర్తు చేశారు. ఇందులో భాగంగా రెండవరోజు బుధవారం ఉచిత హెల్త్ క్యాంప్ కొనసాగిందని, నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ ఉచిత హెల్త్ క్యాంప్ లో మిగిలిన రెండు రోజులలో జర్నలిస్ట్ లు పాల్గొని ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని కోరారు. క్యాంప్ లో భాగంగా వివిధ రకాల రక్త పరీక్షలు, ఈ సి జి పరీక్షలతోపాటు గుండె, దంత, ఈ ఎన్ టి, గైనకాలజీ, ఫ్యామిలీ మెడిసిన్ వైద్యుల ద్వారా వైద్య సేవలు అందించనున్నారు. వైద్య పరీక్షలకు హాజరయ్యే వారు ఖాళీ కడుపుతో రావాలని, గతంలో చేయించుకున్న వైద్య పరీక్షల రిపోర్ట్‌లను ఏవైనా ఉంటే వాటిని తీసుకురావాలని కోరారు. వివరాల కు అమర ఆసుపత్రి సిబ్బంది హేమకుమార్ 8121444424 ను సంప్రదించాలని ఆయన సూచించారు.

# మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య పథకాల అమలుపై శిశు సంక్షేమ/రక్షణ కమిటీ సమావేశం

**-మహిళలు, బాలల భద్రత సమాజ అభివృద్ధికి పునాది**

**- కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్**



**తిరుపతి, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళలు, బాలల సంక్షేమం, రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్న మిషన్ శక్తి–మిషన్ వాత్సల్య పథకాల పురోగతిని సమీక్షించేందుకు జిల్లా స్థాయి శిశు సంక్షేమం, రక్షణ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించి సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల సాధికారత, ఆర్థిక స్వావలంబన, భద్రత కోసం మిషన్ శక్తి ద్వారా చేపట్టిన చర్యలు గ్రామ స్థాయి వరకు ఫలితాలు ఇవ్వాలని, మిషన్ వాత్సల్య ద్వారా ప్రతి బాలుడికి రక్షణ, సంరక్షణ, విద్య, ఆరోగ్యం వంటి మౌలిక హక్కులు అందేలా సమగ్ర చర్యలు చేపట్టాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, బాలల గృహాలు, ఆశ్రయ గృహాలు, ఫోస్టర్ కేర్ కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బాలల సంక్షేమ సంస్థల్లో ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సేవలు, శక్తి టీమ్స్, మహిళా పోలీస్ సహాయ కేంద్రాలు, కౌన్సెలింగ్ సేవలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. పిల్లల పునరావాసం, కౌన్సెలింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. సమావేశంలో మహిళా, శిశు అభివృద్ధి శాఖ పి.డి. వసంతాబాయి డీఎస్పీ శ్రీలత, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి బాలకృష్ణ నాయక్, సీపీఓ రాజశేఖర్, సెట్విన్ అధికారి యశ్వంత్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రాజా సోము, సమగ్ర శిక్షా అభియాన్ అధికారి గౌరీశంకర్, క్రీడాశాఖ అధికారి శశిధర్, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ చిన్న లాలప్ప, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి లోకనాథం, ఐటీడీఏ పి.ఓ శ్రీనివాస్, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్‌లను పరిశీలించిన ఎమ్మెల్యే



**తిరుపతి, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలోని అన్నా క్యాంటీన్ లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. భోజనం నాణ్యత, పరిసరాల శుభ్రత గురించి భోజనం చేస్తున్న వారిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. తొలుత స్విమ్స్ ఎదురుగా ఉన్న క్యాంటీన్ ను ఆయన పరిశీలించారు. తదుపరి ఆర్పీ రోడ్డులోని క్యాంటీన్ ను పరిశీలించి అందరితో పాటు కలిసి భోజనం చేశారు . అన్నం ఇంకొంచెం ఎక్కువ ఉడికితే బాగుంటుందని, సాంబారు మరికొంత రుచికరంగా ఉంటే బాగుంటుందని ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. వారు చేసిన సూచనలను పరిగణన లోకి తీసుకుని వెంటనే సరిదిద్దుకోవాలని నిర్వాహకులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ ఈ శ్యాంసుందర్, ఈఈ లు తులసి కుమార్, గోమతి, డిఈ లలిత, ఎన్డీఏ నాయకులు, సీకే రేవతి, మహబూబ్ భాషా, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ముత్యాలమ్మకు సారె సమర్పణ



**శ్రీకాళహస్తి , ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ముక్కంటి ఆలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో జాతర వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దంపతులు ముత్యాలమ్మ తల్లికి సారె సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. జానపద సంప్రదాయాలతో జరిగే ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని మగవారు ఆడవారి వేషధారణతో అమ్మవారి కలశాన్ని ( గెరిగ ) శిరస్సుపై ఉంచుకుని పట్టణ పొలిమేరల్లో ని తిట్టు రాళ్ల వద్దకు తీసుకెళ్లి పూజలు జరిపారు. ముత్యాలమ్మ రేణుక అమ్మ వార్ల కు ఎదురుగా మైలు ముగ్గు వేసి జాతర వేడుకలు జరిపారు.

# వేదాలకు పుట్టినిల్లు తిరుమల

## - ధర్మగిరిలో శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠం మహోన్నత ప్రస్థానం

**తిరుమల, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారతీయ సంస్కృతికి మూలాధారమైన వేద సంప్రదాయాల పరిరక్షణ, ప్రచారం, ప్రోత్సాహంలో టీటీడీ అగ్రగామిగా నిలుస్తోంది. ఈ దిశగా తిరుమలలోని ధర్మగిరిలో నడుస్తున్న శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠం దేశంలోనే అత్యున్నత వేద విద్యా కేంద్రంగా వెలుగొందుతోంది.

**వేద విజ్ఞాన పీఠం చరిత్ర:**

1884 ఫిబ్రవరిలో మహంత్ ప్రయాగ్ దాస్ జీ ఆధ్వర్యంలో స్థాపించబడిన ఈ వేదపాఠశాల ప్రారంభంలో మూడు విభాగాలతో మొదలై క్రమేణా వేద, ఆగమ, పౌరోహిత్యం, శాస్త్ర విద్యలను సమగ్రంగా బోధించే విశిష్ట సంస్థగా అభివృద్ధి చెందింది. 1992లో తిరుమల ధర్మగిరిలో శాశ్వతంగా స్థాపించబడిన ఈ సంస్థకు "వేద విజ్ఞానపీఠం"గా పునర్నామకరణం చేశారు.

**17 విభాగాల్లో వేద విద్యా బోధన:**

ప్రస్తుతం ఈ విజ్ఞానపీఠంలో నాలుగు ప్రధాన విభాగాల కింద మొత్తం 17 ప్రత్యేక విద్యా శాఖలు నిర్వహించబడుతున్నాయి. వేదాధ్యయనంలో 7 వేదశాఖలు, ఆగమాధ్యయనంలో 5 ఆగమాలు, స్మార్త అధ్యయనంలో 4 విభాగాలు, దివ్య ప్రబంధంలో ఆళ్వారుల 4000 పాశురాలు బోధించబడుతున్నాయి. ఈ కోర్సులు దీర్ఘకాలికంగా నిర్వహించబడుతూ విద్యార్థులకు లోతైన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందిస్తున్నాయి. ఈ విద్యాసంస్థలో ప్రస్తుతం మొత్తం 374 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో వేద కోర్సుల్లో 140 మంది, ప్రబంధ– ఆగమ కోర్సుల్లో 177 మంది, స్మార్త కోర్సుల్లో 57 మంది ఉన్నారు. వీరికి బోధన అందించేందుకు 43 మంది పండితులు



సేవలందిస్తున్నారు.

**విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత:**

విద్యార్థుల సంక్షేమానికి టీటీడీ అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. 540 మంది విద్యార్థులకు వసతి కల్పించే సామర్థ్యం ఉన్న హాస్టల్ సౌకర్యాలు, శుభ్రమైన నివాస వాతావరణం, 24 గంటల నీటి సరఫరా, వేడి నీటి సదుపాయం అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు పోషకాహారంతో కూడిన భోజనం అందించేందుకు ఉదయం పాలు, ఇడ్లీ, దోసె, ఉప్మా వంటి వంటకాలు, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం పాలు, రాత్రి భోజనం అందిస్తున్నారు. విద్యార్థులకు ఉచితంగా దుస్తులు, పుస్తకాలు, నిత్యావసర వస్తువులు అందిస్తున్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం అశ్విని ఆసుపత్రి ద్వారా వైద్య సేవలు, అవసరమైతే తిరుపతిలోని స్విమ్స్, బర్డ్ ఆసుపత్రుల్లో ఉచిత చికిత్స అందిస్తున్నారు.

**భవిష్యత్తుకు భరోసా:**

వేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని టీటీడీ ప్రత్యేక ప్రోత్సాహక పథకాలను అమలు చేస్తోంది. వేద కోర్సుల విద్యార్థుల పేరున రూ.3 లక్షలు, ఇతర కోర్సుల విద్యార్థులకు రూ.ఒక లక్ష డిపాజిట్ చేస్తోంది. కోర్సు పూర్తయ్యాక వడ్డీతో సహా అందజేసి మెరిట్ సర్టిఫికేట్‌తో పాటు శ్రీవారి 10 గ్రాముల వెండి డాలర్ ప్రదానం చేస్తారు.

**వేదాచారాల ఆధారంగా సమగ్ర విద్యా విధానం:**

విద్యార్థుల దినచర్య పూర్తిగా వేదాచారాల ఆధారంగా క్రమబద్ధంగా అమలవుతోంది. ఉదయం సంధ్యావందనం, అగ్నికార్యం నుంచి ప్రారంభమై పఠనం, బోధన, పారాయణం, క్రీడలు, రాత్రి అధ్యయనం వరకు సమగ్ర విద్యా విధానంలో కొనసాగుతోంది.

**పండితులను ఆకర్షిస్తున్న శ్రీ వేంకటేశ్వర వేద శాస్త్ర ఆగమ విద్వత్ సదస్సు:**

వేద, శాస్త్ర, ఆగమ జ్ఞానాన్ని ప్రోత్సహించేందుకు నిర్వహించే శ్రీ వేంకటేశ్వర వేద శాస్త్ర ఆగమ విద్వత్ సదస్సు దేశవ్యాప్తంగా ఉన్న పండితులను ఆకర్షిస్తోంది.

సంప్రదాయ పద్ధతిలో పరీక్షలు నిర్వహించి ప్రతిభావంతులను సత్కరించడం ఈ సదస్సు ప్రత్యేకత. ఇటీవల మార్చి 8 నుండి 13 వరకు ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించ బడింది. టీటీడీ ఆధ్వర్యంలో ధర్మగిరితో పాటు కీసరగుట్ట, నల్గొండ, భీమవరం, కొటప్పకొండ, విజయనగరం వంటి ప్రాంతాల్లో కూడా వేద విజ్ఞానపీఠాలు విజయవంతంగా నడుస్తున్నాయి. "వేదాలకు పుట్టినిల్లు తిరుమల" అనే మహోన్నత భావాన్ని సార్థకం చేస్తూ శ్రీ వేంకటేశ్వర వేద విజ్ఞానపీఠం భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించే దివ్య విద్యా కేంద్రంగా నిలుస్తోంది.

# అభివృద్ధే లక్ష్యంగా పనులు వేగవంతం చేయాలి

**- అభివృద్ధి కార్యక్రమాలపై హెచ్‌ఓడిలతో సమీక్ష - కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్**




**తిరుపతి, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాకు ముఖ్యమంత్రి మంజూరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో కలెక్టర్ బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ గోవింద రావు, రెవెన్యూ అధికారి నరసింహులు, సంబంధిత హెచ్‌ఓడిలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరం నుండి అధికారులతో ప్రత్యక్షంగా, మునిసిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజన్, మండల, తదితర అధికారులతో వర్చువల్ సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, హెచ్‌సిఎం ద్వారా మంజూరైన పనులు ప్రజలకు నేరుగా ఉపయోగపడే విధంగా వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన పనులను గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. మౌలిక సదుపాయాలు, నీటి సరఫరా, విద్య, వైద్యం, వ్యవసాయం, రహదారులు, పరిశ్రమలు వంటి కీలక రంగాల్లో మంజూరైన పనులను ప్రాధాన్యతగా తీసుకుని అమలు చేయాలని సూచించారు. ప్రాజెక్టుల పురోగతిపై వారానికొకసారి సమీక్ష నిర్వహించి, ఆలస్యం లేకుండా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ప్రజలకు సమగ్ర సమాచారం అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన మంజూరుల వివరాలు, ప్రస్తుత పురోగతి, ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ఏఎస్పి రావిమనోహరచ్చారీ, తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, తిరుపతి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయ్ భరత్ రెడ్డి, ఎల్.శివకుమార్, ఇరిగేషన్ డిఈ, రాధాకృష్ణా, ఆర్ అండ్ బిఎస్ఈ, రాజా నాయక్, డి ఎమ్ అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, సివిల్ సప్లై అధికారి శేషు రాజు, ఏ పి ఎమ్ ఐ పి పి డి చిన్న రెడ్డయ్య, గృహనిర్మాణం శాఖ పి డి, ఎస్ డబ్ల్యూ ఎస్ కోఆర్డినేటర్ జగదీష్, పంచాయతీ రాజ్ ఎస్ ఈ మధుసూదన్, అటవీ శాఖ అధికారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈట్ స్ట్రీట్‌లో నిబంధనల మేరకు దుకాణాలు నిర్వహించాలి

**- పారదర్శకంగా దుకాణాలు కేటాయింపు - కమిషనర్ ఎన్.మౌర్య**

**తిరుపతి, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డిప్ ద్వారా ఈట్ స్ట్రీట్ లో దుకాణాలు పొందిన వారు ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి వ్యాపారాలు నిర్వహించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సూచించారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన ఈట్ స్ట్రీట్ లోని 14 దుకాణాలకు బుధవారం కచ్చపి ఆడిటోరియంలో లక్కీ డ్రా నిర్వహించారు. కమిషనర్ స్వయంగా పాల్గొని లక్కీ డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన 14 దుకాణాలకు



పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించామని తెలిపారు. ఇందులో 13 దుకాణాలు లాటరీ ద్వారా కేటాయించగా, 10వ నెంబర్ దుకాణం ఐ స్టోన్ కంపెనీకి నేరుగా కేటాయించామని తెలిపారు. దుకాణదారులు కచ్చితంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి సూచనల మేరకు ఆహార పదార్థాలు విక్రయించాలని తెలిపారు. నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను వినియోగించరాదని, అధిక ధరలకు విక్రయించరాదని తెలిపారు. ఆహార పదార్థాలతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తడి, పొడి చెత్త బుట్టలను వినియోగించాలని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించరాదని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార నాణ్యత ప్రమాణా లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు పవర్‌పాయింట్ ప్రెసెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంకటేశ్వర్ రావు, జగదీష్, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# జలధార-జలహారతి కార్యక్రమాన్ని సమగ్రంగా అమలు చేయాలి

**- ప్రతి నీటి బొట్టును కాపాడి భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పిద్దాం**

**- కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్**



**తిరుపతి, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జలధార –జలహారతి, నీటి సంఘాల బాధ్యత కార్యక్రమాన్ని జిల్లాలో సమగ్రంగా, ప్రణాళికా బద్ధంగా అమలు చేయాలని కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మిని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో ప్రత్యక్షంగా, రెవెన్యూ డివిజన్, మండల, ఎంపీడీ ఓ లు ఇరిగేషన్ సిబ్బంది, వి ఏ ఓ లు, డ్వామా, హార్టికల్చర్, ఆర్ డబ్ల్యు ఎస్, ఏ పి ఎమ్ లు,మున్సిపల్ కమిషనర్లుతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జలధార–జలహారతి కార్యక్రమం రాబోయే 4 –5 సంవత్సరాలకు అత్యంత కీలకమని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో విజయవంతంగా అమలు చేసిన జలధార నమూనాను ఉదాహరణగా తీసుకొని, ప్రతి చెరువు, కాలువ, వాగులను పరస్పరం అనుసంధానం చేసి వర్షపు నీటి ప్రతి బొట్టును సంరక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇరిగేషన్ శాఖతో సమన్వయం చేసుకుని బేసిన్ స్థాయిలో శాస్త్రీయ ప్రణాళికలు రూపొందించాలని, ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినట్లయితే భూగర్భ జలాల స్థాయి గణనీయంగా పెరిగి, సాగుభూమి విస్తీర్ణం పెరిగి రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు. పశుసంవర్ధక రంగం, పాల ఉత్పత్తి విస్తరిస్తుందని. విద్యుత్ వినియోగం తగ్గి ప్రభుత్వానికి వ్యయభారం తగ్గుతుందని తెలిపారు. గ్రామీణ వలసలు తగ్గి స్థానిక ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. మొదట ప్రాధాన్యత గల పనులను గుర్తించి,వంద రోజుల ప్రణాళికతో దశలవారీగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలలో కమిటీలు ఏర్పాటు చేయాలని, గ్రామ స్థాయి కమిటీలో గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్ గా వ్యవహరించాలని, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ది అమలు బాధ్యత అని అన్నారు. వీఆర్‌వో, అగ్రికల్చర్ ఉ హార్టికల్చర్ అసిస్టెంట్లు సభ్యులు గా, నీటి సంఘాల ప్రతినిధులు ప్రత్యేక ఆహ్వానితులు గా ఉంటారని గ్రామ స్థాయిలో పనుల గుర్తింపు, అమలు, పర్యవేక్షణ బాధ్యత ఈ కమిటీకి ఉంటుందని తెలిపారు. మండల స్థాయి కమిటీ లో ఎంపీడీవో చైర్మన్ గా,తహసీల్దార్ సభ్యుడుగా ఉంటారని, మండల అగ్రికల్చర్ అధికారి, హార్టికల్చర్ అధికారి, ఇరిగేషన్ శాఖ ప్రతినిధి, ఏపీవో కన్వీనర్ గా ఉంటారన్నారు. జిల్లా స్థాయి కమిటీలో కలెక్టర్ చైర్మన్ గా వ్యవహరిస్తారని, జాయింట్ కలెక్టర్లు, సభ్యులు గా, ఇరిగేషన్, వ్యవసాయం, హార్టికల్చర్, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులు ఉంటారన్నారు. చెరువుల వద్దే ఫీల్డ్ స్థాయిలో సమావేశాలు నిర్వహించి, రైతులతో ప్రత్యక్షంగా చర్చలు జరపాలని సూచించారు. అగ్రికల్చర్, హార్టికల్చర్ శాఖలు బ్యాక్ ఎండ్ సపోర్ట్ అందించాల్సిన అవసరం ఉందని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, ఇరిగేషన్ డి ఈ, రాధా కృష్ణా, ఎస్ శివారెడ్డి పంచాయతీ అధికారి శ్రీమతి సుశీలా దేవి, డ్వామా పిడి శ్రీనివాసరావు, డి ఆర్ డి ఏ పిడి శోభన్ బాబు, వ్యవ సాయ శాఖ అధికారి ప్రసాద రావు, ఏ పి ఎమ్ ఐ పి పి డి చిన్న రెడ్డయ్య, పంచాయతీ రాజ్ ఎస్ ఈ మధుసూదన్, పాసు సంవర్ధక శాఖ అధికారి రవి కుమార్, విధ్యుత్ శాఖ, భూగర్భ శాఖ అధికారి సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ వద్ద బిసీవై పార్టీ కార్యకర్తల దీక్ష

**తిరుపతి, ఏప్రిల్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ఈనెల 11వ తేదీన మంగళగిరి పూలే ప్రాంగణంలో నిర్వహించనున్న ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా తిరుపతిలో కలెక్టరేట్ వద్ద చేపట్టిన బీసీవై పార్టీ కార్యకర్తల రిలే నిరాహార దీక్ష మూడో రోజు బుధవారం కొనసాగింది. పార్టీ తిరుపతి జిల్లా కన్వీనర్ వంక రమణయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు పూల ప్రేమ్, హిమబిందు గన్నవరపు, సూళ్లూరుపేట కన్వీనర్ వీ. రాజా, చంద్రగిరి కన్వీనర్ ఈశ్వర్ గౌడ్, కో కన్వీనర్ వెంకటేష్, ఏర్పేడు మండల కన్వీనర్ సిరి మునిశేఖర్, తొట్టంబేడు కన్వీనర్ సునీల్, సీనియర్ నాయకులు వంకాయల రమణయ్య, రాంచంద్రయ్య, రామకృష్ణ, జయరాం, యువ నాయకులు ప్రేమ్ యాదవ్, కళ్యాణ్, సురేష్, విజయ్, రోహిత్ పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027